# జనబలం


ప్రజలే ప్రభువులు

ఫిబ్రవరి 2024 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-

## యూనియన్ తాత్కాలిక బడ్జెట్ 2024-25




## నాసిగానే విద్యా ప్రమాణాలు
## సాంకేతికతతో కొత్త అవకాశాలు



How does OPS operate?
A massive 18% of all taxes and government revenues is solely spent on pensions, benefiting a mere 3.2% of the workforce.
If States revert to unfunded, non-contributory OPS, this spending will sharply increase and bankrupt the governments.
REFUSE IT DEFUSE IT!
OLD PENSION SCHEME
FOUNDATION for DEMOCRATIC REFORMS
FDR

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఫిబ్రవరి **2024**

సంపుటి **25** సంచిక **02**


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్



*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




ఎందుకంత దిగులు! ఇది చూసి ఏదో ఒక పార్టీ టికెట్ ఇవ్వకపోదులే! అంతా మన మంచికే!!

## లోపలి పేజీలలో..


➥ యూనియన్ తాత్కాలిక బడ్జెట్ 2024-25 — 6

➥ అభ్యసనా సామర్థ్యాల మెరుగుదలపై.. డిజిటల్ నైపుణ్యాల ప్రభావం! — 9

➥ అందరికీ అనువుగా విద్యా చట్రాన్ని సరళతరం చేయాలి — 12

➥ గాంధీ - గణతంత్ర భారతం — 18

➥ బలమైన స్థానిక పాలనతోనే దేశాభివృద్ధి — 23

➥ ఓట్ల కోసమైనా రేవంత్ సమగ్ర ఆరోగ్య విధానం అమలు చేస్తారా? — 26

➥ సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకంపైనే దేశ భవిష్యత్తు — 33



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

## విద్యారంగంలో సాంకేతికతతో

# కొత్త ఆకాంక్షలు - కొత్త ఆలోచనలు!

మనదేశంలో గత మూడు దశాబ్దాలుగా "అందరికీ విద్య" అందించే సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం కొనసాగుతోంది. అందుకోసం అన్ని ప్రభుత్వాలూ బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తూ వచ్చాయి. దాదాపు పదిహేనేళ్ళ క్రితం మన పార్లమెంటు మన పిల్లలకు "విద్యాహక్కు" ను చట్టబద్ధం చేసింది. అందుకోసం పౌరులు అందరూ విద్యాసెస్సును చెల్లించేటట్లు ఆ చట్టంలో ఏర్పాటు చేసింది. నాలుగేళ్ళ క్రితం నూతన విద్యావిధానం - 2020 అమల్లోకి వచ్చింది. వీటి పర్యవసానంగా విద్యారంగ స్థితిగతులు, సమస్యలు నిరంతరం చర్చనీయాంశాలుగా మన ముందుకు వస్తూనే ఉన్నాయి.

11 వ పంచవర్ష ప్రణాళికలో విద్యారంగ వ్యయం 1,37, 734 కోట్ల రూపాయలు కాగా 12 వ పంచవర్ష ప్రణాళికలో వ్యయం 3,43,028 లక్షల కోట్లుగా పెరిగింది. 2010 నుండి 2015 వరకూ దేశంలో విద్యాహక్కు చట్టం అమలు కోసం 2.31 లక్షల కోట్ల రూపాయలను ఒక్క సర్వశిక్షా అభియాన్ ఖాతాకు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. 2014-2024 మధ్య గడిచిన పదేళ్ళలో విద్యకోసం కేంద్రప్రభుత్వం సుమారు 8.7 లక్షల కోట్ల రూపాయలను కేటాయించింది. దీనికి రాష్ట్రప్రభుత్వాలు చేస్తున్న వ్యయం అదనం. గత కొన్నేళ్ళుగా జి.డి.పిలో విద్యకోసం సుమారుగా 4 శాతం సొమ్మును ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

చేసిన ఖర్చుకు తగిన ఫలితాలు రావడంపై దృష్టి సారించాలని పూర్వ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పలుసార్లు నొక్కిచెప్పారు. దీన్ని మూల్యాంకనం చేయడానికి ప్రభుత్వం తనవంతుగా ఎన్నో చొరవలను ప్రారంభించింది. పౌర సమాజం తరపున ఈ బాధ్యతను ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ తన "అసర్" సర్వే ద్వారా చేపట్టింది. 2005 నుండి ప్రతి ఏటా అసర్ సర్వే దేశవ్యాప్తంగా జరుగుతూ వచ్చింది. "అసర్" సర్వే నివేదికలు భారతీయ విద్యారంగ బహిరంగ చర్చను నిరంతరం ప్రభావితం చేస్తూ వచ్చాయి.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో "అసర్' గణాంకాలు ప్రభుత్వ విధాన నిర్ణయాలను గాఢంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో "అసర్ 2023, బియాండ్ బేసిక్స్" నివేదిక జనవరి 17 వ తేదీన న్యూఢిల్లీలో విడుదల అయ్యింది. అందులోని గణాంకాలు, విశ్లేషణలు కొన్ని కొత్త అంశాలను చర్చలోకి తెచ్చాయి.

అందరికీ విద్య నినాదంతో 1990లో ప్రారంభమైన సర్వశిక్షా అభియాన్ కార్యక్రమం విజయవంతం అయ్యింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల వయోవర్గంలోని 97శాతం మంది పాఠశాలలో నమోదు అయ్యారు. 2005-06 విద్యా సంవత్సరం నాటికి ఎనిమిదో తరగతిలో చేరిన విద్యార్థుల సంఖ్య 1కోటి పది లక్షల మంది కాగా 2020-21 విద్యా సంవత్సరం నాటికి వీరి సంఖ్య రెండుకోట్ల ఇరవై లక్షలకు చేరింది.

విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చాక సెకండరీ స్థాయిలో పాఠశాల నమోదును సార్వత్రికం చేయాలన్న లక్ష్యం కూడా తరతమ స్థాయిల్లో విజయవంతం అయ్యింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి సెకండరీ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు 88.81 శాతంగా ఉన్నారని తేలింది.

నూతన విద్యావిధానం అమల్లోకి వచ్చాక హయ్యర్ సెకండరీ స్థాయిలో నమోదును సార్వత్రికం చేయాలన్న కృషి కొనసాగుతోంది. 14-18 వయోవర్గం కౌమార యువతలో సుమారు 86శాతం పిల్లలు ఏదో ఒక విద్యాసంస్థల్లో నమోదై ఉన్నారని అసర్-2023 బియాండ్ బేసిక్స్ నివేదిక వెల్లడించింది. పిల్లలను బడికి పంపడం, పాఠశాల నమోదు, నమోదైన పిల్లలు నిలకడగా బడిలో కొనసాగడం వంటి విషయాల్లో మన దేశం గణనీయమైన విజయాలు సాధించింది.

అయితే పిల్లల అభ్యసనా సామర్థ్యాలు నాసిగా ఉంటున్నాయన్న సంగతి తెలిసిందే. ఐదేళ్ళు లేదా పదేళ్ళపాటు బడికి వెళ్ళినప్పటికీ మనపిల్లల్లో అత్యధికులు మాతృభాషలోనే చిన్న చిన్న పేరాలు, వాక్యాలు చదవలేక పోతున్నారు. చిన్న చిన్న తీసివేతలు, భాగహారాలు చేయలేకపోతున్నారు. రోజువారీ జీవితానికి

అవసరమైన చిన్న చిన్న లెక్కలు చేసుకోలేక పోతున్నారు. వారి ఇంగ్లీషు సామర్థ్యాల గురించి చెప్పాల్సిన పనేలేదు. అది ఒక కొరకరాని కొయ్యగా మారింది.

మన ప్రభుత్వాలూ, తల్లిదండ్రులూ ఇంగ్లీషు మోజులో మాతృభాషను పక్కన పెట్టడం చూస్తున్నాం. మన విద్యావ్యవస్థలో పరీక్షలకు ఇస్తున్న ప్రాధాన్యం చదువుల నాణ్యతకూ, పిల్లల సామర్థ్యాలకూ, ఇవ్వడం లేదు. పరీక్షలు అటు పిల్లలకు, ఇటు తల్లిదండ్రులకు విపరీతమైన ఒత్తిడిని కలిగిస్తున్నాయి. పాఠశాలలో కూడా ఏదో విధంగా పిల్లల్ని పై తరగతులకు పంపించడానికే ప్రాధాన్యం పెరిగింది.

సమాజపు దృష్టిని విద్యానాణ్యత పైకి మళ్ళించే ప్రయత్నాలు జరగకపోలేదు. నాణ్యతపై ఉపాధ్యాయులకు ఆధునిక శిక్షణ ఇచ్చే కార్యక్రమం ప్రారంభం అయింది. అది మరింత ముమ్మరం అయ్యే దశలో కరోనా మహమ్మారి వచ్చి మన జీవితాన్ని అతలాకుతలం చేసింది. ప్రజల జీవనోపాధికి జరిగిన నష్టాలను పూడ్చగలం గానీ విద్యార్థుల అభ్యసనానికి జరిగిన నష్టాన్ని పూడ్చడం సాధ్యంకాదు.

కరోనా కాలంలో గాడి తప్పిన విద్యారంగాన్ని సరైన దారిలో పెట్టడం అత్యంత క్లిష్టంగా మారింది. దేశ ఆర్థికరంగంలో వచ్చిన మార్పులకు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో మార్పులు అవసరం. కానీ అలాంటి మార్పులు తీసుకురావడం మన ముందున్న ఒక పెద్ద సవాలు.

డిజిటల్ సాంకేతికత విస్తృతం అవుతున్న తరుణంలో నూతన అవకాశాలకు తలుపులు తెరుచుకున్నాయి. దేశంలో నూరు కోట్లమంది మొబైల్ ఫోన్లు వాడుతున్నారు. అందులో 40 కోట్లమంది స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నారు.

14 - 18 వయోవర్గం లోని కౌమార వయస్కులలో 90 శాతం మందికి స్మార్ట్ ఫోన్ ఉపయోగించడం తెలుసునని అసర్ -2023 నివేదిక వెల్లడించింది.

స్మార్ట్ ఫోన్లను సొంతానికి కలిగి ఉండే విషయంలో జెండర్ వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అత్యధికులు వేర్వేరు అవసరాలకోసం ఫోన్లని వినియోగించే నైపుణ్యాలను కలిగివున్నారని "అసర్ -2023" నివేదిక తెలిపింది. చదువుతూ కూడా పనులకు వెళ్తున్నవారి సంఖ్య కూడా గణనీయంగా ఉందనీ, సైన్సు కోర్సులకంటే హ్యూమానిటీస్ చదివే వారు ఎక్కువని, వృత్తి విద్యా కోర్సులు చదివే వారి సంఖ్య అత్యంత స్వల్పంగా ఉందని కూడా నివేదిక తెలిపింది. అలాగే పాఠశాల నుండి డ్రాప్ ఔట్ అయినవారిలో అత్యధికులు ఏదో ఒక డిగ్రీ కావాలని కోరుకుంటున్నారని, పనిచేసుకుంటూ చదువు కొనసాగించే వీలు కోసం ఎక్కువమంది ఎదురు చూస్తున్నారని, ఏ వయసులోనైనా , ఏ సమయంలో నైనా, ఏ కోర్సు అయినా చదువుకునే అవకాశాలు కల్పించాలన్న ఆకాంక్ష యువతలో వ్యక్తం అవు తోందనీ అసర్ నివేదిక వెల్లడించింది .

సాంప్రదాయక తరగతిగది, సంప్రదాయక సిలబసు, సంప్రదాయక పరీక్షా పద్ధతికి మనం అలవాటు పడి ఉన్నాం. రానున్న కాలంలో కూడా సంప్రదాయక పద్ధతులకు గట్టి మద్దతు ఇంకా కొనసాగుతుందనడంలో ఎలాంటి అనుమానమూ లేదు.

కానీ సంప్రదాయక పద్ధతులకు భిన్నంగా అందరూ చదువుకోవడానికి , ఎప్పుడైనా, ఎక్కడైనా చదవడానికి, ఎక్కడైనా పరీక్షరాయడానికి వీలు కల్పిస్తూ మన విద్యా చట్రాన్ని సులభతరం చేయాలని "అసర్-2023" నివేదిక సూచించింది.

సార్వత్రిక విద్యా లక్ష్యాలు నూరు శాతం చేరుకోవడానికి , కొత్తగా అందుబాటులోనికి వచ్చిన సాంకేతికతను విద్యావసరాలకు మరింతగా వినియోగించుకోవడానికి, కొత్తతరం ఆకాంక్షలను నెరవేర్చడానికి మన విద్యావ్యవస్థలో వినూత్న, సృజనాత్మక ఆలోచనలకు చోటు కల్పించాల్సి ఉంది.

సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో రాజకీయ పార్టీల అజెండా లోనూ, బహిరంగ చర్చలోనూ విద్యారంగ స్థితిగతులను తీసుకురావాల్సిన అవసరం ఉంది. "అసర్ - 2023, బియాండ్ బేసిక్స్" నివేదిక అందుకు అవసరమైన ఆలోచనలను ప్రాతిపదికలను మన ముందుంచింది.

డి. సోమ సుందర్

# యూనియన్ తాత్కాలిక బడ్జెట్ 2024-25



**యూనియన్ తాత్కాలిక బడ్జెట్ 2024-25పై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ స్పందనలోని ముఖ్యాంశాలు:**

ఎన్నికలకు ముందు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ తాత్కాలిక బడ్జెట్‌లో గొప్ప విషయం ఏ రకమైన మార్పులు లేకపోవటం. మామూలుగా ఎన్నికలకు ముందు మనలాంటి పేద దేశంలో, ఎన్నికల్లో ఏమవుతుందోనని పార్టీలు, అభ్యర్థులు జ్వరమొచ్చినట్లు కంగారుపడే దేశంలో, ఏదోకరకంగా చివరి క్షణంలో ఏదో చిట్కాలతో జనాల్ని ఆకర్షించాలనుకునే దేశంలో జనాకర్షక పథకాలు, తాత్కాలిక తాయిలాలు, ప్రజలను మభ్యపెట్టటం చూస్తుంటాం. అవేమీ లేకుండా గతంలో ఉన్నదాన్నే కొనసాగించటం, పన్నుల్లో ఏమాత్రం తేడా లేకుండా చేయటం, తాత్కాలిక ఆకర్షణ లేకుండా చేయటం, కొత్త సంక్షేమ పథకాలు లేకుండా చేయటం, పెట్టుబడుల్ని రికార్డుస్థాయిలో పెట్టటం, మౌలిక సదుపాయాల కోసం ఆ పెట్టుబడుల్ని వచ్చే ఏడాది కూడా మళ్లీ 10-11% పెంచటం, ఆర్థిక క్రమశిక్షణ దాదాపు నూటికి నూరుశాతం పాటించటం, పన్నులు ఎంతవరకు అనుకున్నారో దాదాపు అంతవరకు వసూలవటం, ఎంత ఖర్చవుతుందనుకున్నారో అంతే ఖర్చవటం గొప్ప విశేషం.

బడ్జెట్ లోటు తగ్గింది. ఈ సంవత్సరం 5.9% ద్రవ్యలోటు అంచనా వేశారు. ద్రవ్యలోటుని 5.8%కి కుదించి, అదనంగా 0.1% తగ్గించారు. ఎన్నికల సంవత్సరంలో కొంత బడ్జెట్‌లో ఖర్చు పెరిగితే పెద్దగా ఎవరూ విమర్శించరు. అయినా కూడా అనుకున్నదాని కంటే ఇంకా క్రమశిక్షణ పాటించారు. అలాగే వచ్చే ఏడాది ఎన్నికల సంవత్సరం ప్రజల ఓట్ల కోసం డబ్బులు ఖర్చు పెడితే పెద్దగా ఎవరూ కాదనరు. మన తెలుగు రాష్ట్రాల్లో మనం చూస్తున్నాం రోజూ. ఎన్నికలే పరమావధి, ఎన్నికల్లో గెలవటం కోసం రాష్ట్రం మొత్తం దివాలా తీసినా పర్లేదు, రాష్ట్రం పోతే మనకేం పోయింది, మనం పెరగాలి, మనం పదవుల్లో ఉండాలి లాంటి రాజకీయం నడుస్తున్న రోజుల్లో నూటికి నూరుపాళ్లు క్రమశిక్షణ పాటించి అనుకున్నట్లుగానే మౌలిక సదుపాయాలకి, దీర్ఘకాలిక అభివృద్ధికి డబ్బు ఖర్చు పెట్టి, దుబారా ఖర్చులు అరికట్టి అప్పుల్ని తగ్గించటం గొప్ప విషయం. వచ్చే ఏడాది బ్రహ్మాండంగా ఊహిస్తే జాతీయాదాయంలో ద్రవ్యలోటు ఈ సంవత్సరమున్న 5.9 నుంచి 5.4కి వెళ్తుందని అనుకున్నారు. అలాంటిది ఈ సంవత్సరం 5.8 చేసి, వచ్చే సంవత్సరం 5.1 శాతానికి కుదించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదొక అద్భుత విషయం. చూడ్డానికి సాధారణంగా కనిపిస్తుంది. కానీ ఎన్నికల సమయంలో, ఒక పేద దేశంలో, ఇంత సంక్లిష్టమైన దేశంలో, ఒక ప్రభుత్వం ఇంత ధైర్యంగా చేస్తుందంటే మూడు విషయాలు మనం గమనించాలి.

ఒకటి, ఆ ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసం ఉంది. మేం ఈ తొమ్మిదిన్నర సంవత్సరాలలో చాలా చేశాం, కాబట్టి మా మీద మీరు భరోసా పెట్టవచ్చు, మమ్మల్ని నమ్మవచ్చు మేం చేసింది చూసి అన్న ధీమా ఉంది. రెండోది, దీర్ఘకాలిక అభివృద్ధి ముఖ్యం తప్ప ఎన్నికల కోసం జనానికి గాలం వేసి ఆర్థిక వ్యవస్థను కుళ్లబొడవటం మంచిది కాదు అనే సంకల్పం, చిత్తశుద్ధి ఉన్నాయి. మూడు, ప్రతి బడ్జెట్‌లో మనం గారడీలు చేయకూడదు. ఆర్థిక స్థిరత్వం ఉండాలి దేశంలో. ప్రతి బడ్జెట్‌లో గందరగోళం చేసినట్లయితే, ప్రపంచానికి గాని, మన దేశ ప్రజలకి గాని ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ మీద నమ్మకం సడలిపోతుంది. సడలిపోతే దేశం నష్టపోతుంది, అప్పుల భారం పెరిగిపోతుంది, అప్పుల మీద వడ్డీలు పెరిగిపోతాయి కాబట్టి ఆ ఆర్థిక స్థిరత్వం కావాలనే సంకల్పం ఉంది. ఈ మూడింటికీ మనం ప్రభుత్వాన్ని మనసారా అభినందించాలి. పార్టీలేమిలో మనకు అనవసరం, ప్రభుత్వాన్ని, పార్టీల్ని విమర్శించినా, మెచ్చుకున్నా కూడా వాళ్ల కులమేమిటి, మతమేమిటి, రంగేమిటి కాదు, వాళ్లు ఏం చేస్తున్నారు, ఏ కారణాలుగా మనం విమర్శిస్తున్నాం - లేక అలా నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా విశ్లేషిస్తే, మన ప్రయోజనాలు నెరవేరతాయి.

ఈ సంవత్సరం రికార్డు పెట్టుబడులు పెడుతున్నారు. 10 లక్షల



కోట్లు ప్రత్యక్షంగా జాతీయస్థాయి ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే, ఇతరత్రా పెట్టుబడులు, రాష్ట్రాల పెట్టుబడుల కోసం ఇచ్చే డబ్బులుగానీ, ప్రభుత్వరంగ సంస్థల పెట్టుబడులుగానీ, 18 లక్షల కోట్లు మౌలిక సదుపాయాల కోసం కేటాయించారు. దేశ చరిత్రలో రికార్డు ఇది. వచ్చే ఏడాది ప్రభుత్వం ప్రత్యక్షంగా పెట్టే పెట్టుబడులు మళ్లీ ఇంకో 11% పెంచారు. బహుశా ఇంకా ఎక్కువ పెంచొచ్చు అంతా మంచిగా జరిగితే, ఈ ప్రభుత్వంలో మరో మంచి పని, తక్కువ చెప్పి ఎక్కువ చేస్తున్నారు. మామూలుగా మనం రాష్ట్రాల్లో రోజూ చూస్తున్నాం, బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువ చూపెడతారు, రెవెన్యూ ఎక్కువ వస్తుందని చెబుతారు, కానీ తక్కువ వస్తుంది, ఇంతింత ఖర్చు పెడతామంటారు, తక్కువ ఖర్చు పెడతారు. యూనియన్‌లో వీళ్లు తక్కువ రెవెన్యూ చెబుతూ ఎక్కువ పన్నుల వసూళ్లు చేస్తున్నారు, పన్నులు పెంచకుండా. తక్కువ ఖర్చు చేస్తామని చెబుతూ ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. అది మంచి సంప్రదాయం. ఎందుకు ఇది అవసరం అంటే, ఆర్థిక క్రమశిక్షణ కోసం ఎందుకు అంత గట్టిగా మనం పట్టుబడుతున్నాం, ఇంత ప్రధానంగా భావిస్తున్నాం, తాత్కాలిక తాయిలాలు మంచివి కావని చెబుతున్నాం అంటే, రేపటి ఆర్థిక ప్రగతికి ఈరోజు చేసే పొదుపు, పెట్టే పెట్టుబడులు పునాదులవుతాయి.

మనం రోజూ పార్టీల కోలాహలం చూస్తున్నాం. ఫెడరల్ వ్యవస్థలో ఏ రాష్ట్రానికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా కూడా మాకు ఢిల్లీ డబ్బులివ్వటం లేదు, యూనియన్ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవటం లేదు, మా మీద కసితో అన్యాయంగా వ్యవహరిస్తున్నాం అని రోజూ మాట్లాడుతుంటారు. ఎవరు ఢిల్లీలో అధికారంలో ఉన్నా, యూపీయే ప్రభుత్వం మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఉన్నా, ఎన్‌డీయే ప్రభుత్వం మోదీ నాయకత్వంలో ఉన్నా, అంతకు ముందు వాజపేయి ప్రభుత్వంలో ఎన్‌డీయే ఉన్నా మనకు రాజకీయంగా దుమారం సహజంగా ఉంటుంది. కానీ డబ్బు చాలా పరిమితమైనది. డబ్బు ముద్రిస్తే వచ్చేది కాదు. ముద్రిస్తే డబ్బు విలువ పూర్తిగా పడిపోతుంది. అయితే పన్నుల రూపంలో రావాలి, లేకపోతే అప్పుల రూపంలో రావాలి. పన్నుల రూపంలో ఎప్పుడు వస్తుందీ? ఆర్థికంగా పెరిగి, ఆర్థిక లావాదేవీలు పెరిగితే, ఆదాయం నుంచి పన్నులు వస్తాయి గానీ ఆదాయం లేకుండా పన్నులు ఎట్లా వస్తాయి? పూర్వకాలంలాగా రాచరికంలాగా, విఠలాచార్య సినిమాలోలాగా ప్రజల్ని హింసించి పన్నులు వసూలు చేయటం ఎలా సాధ్యమవుతుంది? యూనియన్ ప్రభుత్వాన్నే తీసుకోండి. వచ్చే ప్రభుత్వానికి 42.30 లక్షల కోట్ల ఆదాయాన్ని బడ్జెట్‌లో పన్నులు, పన్నేతర ఆదాయాలు అంచనా వేశారు. కానీ రాష్ట్రాలకు వివిధ రూపాల్లో బదిలీ చేసే డబ్బు 22,74,541 కోట్లు. ఆర్థిక సంఘం నిధుల బదిలీ కావచ్చు, కేంద్ర ప్రతిపాదిత పథకాలు, ఇతరత్రా కొన్ని గ్రాంట్లు కావచ్చు. వీటితోపాటు వడ్డీ లేని రుణాలు వచ్చే ఏడాదికి రూ.1,30,000 కోట్లు. ఇది కాకుండా కేవలం అప్పుల మీద వడ్డీలు రూ. 11,90,440 కోట్లు. రెండూ కలిసి 34,65,000 కోట్ల ఖర్చు. ఇది కాకుండా రూ.7,68,221 కోట్లు జీతాలు, భత్యాలు, పెన్షన్లు. మొత్తం రాష్ట్రాలకు బదిలీలు, వడ్డీ చెల్లింపులు, జీతభత్యాల ఖర్చు కలిపితే 3000 కోట్లు పైచిలుకు ప్రభుత్వానికి లోటు. అయినా ప్రస్తుత ప్రభుత్వం పన్నుల రేట్లు పెంచకుండా, దుబారా ఖర్చు తగ్గించి, సంక్షేమ పథకాలని సమర్థంగా అమలు చేస్తూనే ఉత్పాదక వ్యయం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల కోసం ఖర్చు పెట్టి భవిష్యత్తులో అప్పుల భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం.

రాష్ట్రాల్లో కూడా ఆర్థిక క్రమశిక్షణ కావాలి. తెలంగాణలో మనం చూశాం. రాష్ట్రం ఏర్పడినప్పుడు అపార నిధులున్న రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. కొత్త ప్రభుత్వం ఏడాదికి రూ. 1,20,000 కోట్ల హామీలిచ్చింది. వాటిలో సగం అమలు చేసినా ప్రభుత్వం వద్ద పైసా ఉండదు. అప్పులు చేసినా మొత్తం అప్పుల డబ్బంతా కూడా సంక్షేమానికే సరిపోదు. ఇంక పెట్టుబడులు ఎలా సాధ్యమవుతాయి? ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అంతకంటే కష్టంగా ఉంది. హైదరాబాద్ లాంటి నగరం లేదు కాబట్టి, సంక్షేమ పథకాలు మరీ ఎక్కువైపోయాయి కాబట్టి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు పెంచటం జరగటం లేదు కాబట్టి అక్కడ మరింత కష్టంలో ఉన్నారు. అంచేత ఏ రాష్ట్రానికైనా, జాతీయ స్థాయిలోనైనా ఈ ఆర్థిక క్రమశిక్షణ వర్తిస్తుంది. ఇది మనం బాగా అర్థం చేసుకోవాలి. మనం లోతుగా వెళ్లకుండా, ఊరికే వాడు డబ్బులిస్తే అయిపోతుంది, వీడు డబ్బులిస్తే అయిపోతుంది అని అలవోకగా మాట్లాడేస్తున్నాం పత్రికల్లో, రాజకీయంలో, చట్టసభల్లో. డబ్బు చెట్ల మీద మొలవదు, మనం సృష్టించాలి. డబ్బు నోట్లు ముద్రిస్తే రాదు, సంపద సృష్టితో వస్తుంది. సంపద సృష్టిలేని డబ్బు చిత్తు కాగితం. సంపద సృష్టి మన మౌలిక సదుపాయాలు, ఉత్పాదకత, ఉపాధి కల్పన నుంచి వస్తాయి. సంపద సృష్టి ఊరికే ఎవరో తేరగా ఇచ్చే డబ్బుల్లో రాదు. ప్రభుత్వంలో కూర్చోబెట్టి జీతాలిచ్చే ఉద్యోగాల్లో రాదు.

సంపద సృష్టి అంటే మనకు కావలసిన వస్తువుల్ని ఉత్పత్తి చేయటం. అది అధికమైతే డబ్బులు ఎందుకు పొదుపుగా వాడుకోవాలో, ఎందుకు దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహించాలో, ఎందుకు తాత్కాలిక సంక్షేమాన్ని కొంత అదుపు చేయాలో మనకు అర్థమవుతుంది. ఈ సమన్వయం చేయటంలో, ఆర్థిక క్రమశిక్షణ పాటించటంలో, దీర్ఘకాలంలో అభివృద్ధి అవకాశాల్ని పెంచటంలో ఆర్థిక ప్రగతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల కల్పన విషయంలో కచ్చితంగా మోదీ ప్రభుత్వానికి, ఈ బడ్జెట్‌కి ఫస్ట్ మార్కు ఇవ్వాల్సి ఉంటుంది. పూర్తిగా అభినందించాలి. దాంతోపాటు ఒక మంచిపని చేశారు. ఇళ్ల నిర్మాణం మీద ధ్యాస పెడుతున్నారు. పేదరికం పోవాలంటే తాత్కాలిక సాయం కాదు, అంతకుమించి పేదరికం పోయే ఏర్పాట్లు కావాలి. జీవితంలో భద్రత కావాలంటే ఆస్తి ఉండాలి. ఇల్లు ఉంటే బ్యాంకుల్లో తనఖా పెట్టి అప్పు తీసుకోవచ్చు. ఏదైనా వ్యాపారంలో పెట్టుబడి పెట్టొచ్చు, జీవితంలో భరోసా ఉంటుంది. అలాగే ఒక లక్షల కోట్ల రూపాయలు రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్‌కి కేటాయించారు. ప్రయివేటు కంపెనీలకు దీర్ఘకాలంలో అతితక్కువ వడ్డీతో అందించే ఏర్పాటును స్వాగతించాలి. ఎందుకంటే ఇతర దేశాల నుంచి టెక్నాలజీ అరువు తెచ్చుకునే స్థాయి నుండి సొంతంగా తయారుచేసే స్థాయికి ఎదగకపోతే ఆర్థిక వ్యవస్థ ఒక పరిమితి దాటి పెరగదు. అలాగే రాష్ట్రాలకు మౌలిక వసతుల కోసం రుణాలివ్వటం అభినందనీయం.

అయితే ఆర్థిక క్రమశిక్షణ, నిర్వహణ విషయంలో ఫస్ట్ మార్కులు వచ్చినా కూడా చేయాల్సినవి ఎన్నో ఇంకా ఉన్నాయి. రేపు ఎన్నికలయ్యాక ఏ పార్టీ, ఏ కూటమి అధికారంలోకి వచ్చినా పట్టించుకోవాల్సిన విషయాలు రెండున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కొనసాగించాలి. పెట్టుబడుల్ని పెంచి ఇప్పుడు జరుగుతున్న రీతిలో. బాధ్యతతో మెలగాలి, కొత్త పెట్టుబడులకు దోహదం చేయాలి. దాంతోపాటు విద్య, నైపుణ్యం, ఆరోగ్యం. మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం లేకుంటే ఉత్పాదకత ఉండదు. ఉత్పాదక శక్తి ద్వారా అదనపు విలువ నుంచే ఆర్థిక వ్యవస్థ పెరిగేది. మన దేశంలో ఉత్పాదకత ప్రపంచంతో పోలిస్తే చాలా తక్కువ. విద్య అంటే పదవ తరగతి పాస్ కావటం, డిగ్రీ సర్టిఫికెట్ కాదు. విద్య అంటే బుద్ధి వికసించటం, జ్ఞానాన్ని ఉపయోగించటం,. ఉత్పత్తి కోసం నైపుణ్యం కావాలి. మనం చదువులు పేరుతో లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నాం. అదనపు ఖర్చు అక్కర్లా. ఇప్పుడు పెడుతున్న ఖర్చుకు ఫలితం వచ్చేట్లు చూడాలి. పిల్లల బుద్ధి వికసించాలి, ముఖ్యంగా పేద, దిగువ మధ్యతరగతి వర్గాల పిల్లలకి తెలివితేటలున్నా వికసించటంలా. దీనిపై దృష్టి పెట్టాలి. డబ్బు ఖర్చు పెట్టటం కాదు, పెట్టే ఖర్చు సద్వినియోగం కావాలి. ఆరోగ్యంలో ప్రపంచంలో అతి తక్కువ ఖర్చు పెడుతున్నాం. కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల ఏటా దేశంలో అయిదు కోట్ల మంది పేదలవుతున్నారు. ఈసురోమని మనుషులుంటే దేశం ఎలా బాగుపడుతుంది? అభివృద్ధి, ఆదాయాలు ఎలా పెరుగుతాయి? ఈ రెంటి మీదా తగిన దృష్టి లేదు. అరకొరగా కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ మౌలికంగా మనం చాలా వెనకున్నాం. ఈ రెండు రంగాల్లో, జీ-20 దేశాల్లో అట్టడుగున ఉన్నాం.

మొన్న ఎన్నికల్లో తెలంగాణలో 7,8 వేల కోట్లు ఖర్చు పెట్టారు. అత్యధిక భాగం అక్రమ ఖర్చు, లెక్కకురాని, ఓట్ల కొనుగోలు ఖర్చు. రేపు ఏపీలో 10 వేల కోట్లు ఖర్చవుతుంది. దేశంలో రానున్న లోక్‌సభ ఎన్నికలకు బహుశా లక్ష కోట్ల దాకా ఖర్చవుతుంది. ఇందులో అత్యధిక భాగం లెక్కచూపనిది. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగం ద్వారా లక్ష కోట్లు ఖర్చు పెట్టినప్పుడు, అయిదారు లక్షల కోట్లు తినకపోతే సమాజంలో రాజకీయం నడపలేరు. ఆ తినటమేకాదు నష్టం, మార్కెట్‌లో పోటీ లేకుండా, అన్యాయాన్ని తలపెట్టాలి, ప్రభుత్వ ఆస్తుల్ని దోచుకోవాలి, ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు, మిగతావాటి ప్రమాణాలు దిగజార్చాలి. జరిగే నష్టం ఇంకా మూడు, నాలుగు రెట్లు ఎక్కువ ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతుంది. చట్టబద్ధపాలన కావాలి. తగవులు పరిష్కరించకపోతే కోర్టులో, ఎవరి మీద ఎవడైనా దౌర్జన్యం చేసే పరిస్థితి వస్తే, పెట్టుబడులెలా వస్తాయి? గూండాల పాలన, బడితె ఉన్నవాడిదే బర్రె కాకుండా. చట్టం అందరినీ సమానంగా చూసి ఖర్చు లేకుండా, వేగంగా తగదాల్ని పరిష్కరించాలి. సమస్యల్ని తీర్చాలి. నేరానికి శిక్ష పడాలి. చట్టబద్ధపాలన కావాలి. మూడోది, అధికారం వీలున్నంతవరకు ప్రజల చుట్టూ ఉన్నట్లయితే నా పన్నుల డబ్బు ఎటు పోతోంది, పనేం జరుగుతోంది పట్టించుకోగలుగుతారు. నేను ఓటు ఎవరికి వేస్తున్నాను, నాకు ఏం జరుగుతోంది అర్థమవుతుంది. ఈ మూడు పనులూ చేయకపోతే ప్రజాస్వామ్య ఫలితాలు పేదలకు అందవు. ఓటు కొనుక్కునే వస్తువుగా మారిపోతుంది. తాత్కాలిక తాయిలాలు తప్ప దీర్ఘకాలిక అభివృద్ధి ప్రజలకు కనిపించదు. పేదల పిల్లలు పేదలుగా కొనసాగుతుంటారు.

కాబట్టి ఆర్థిక క్రమశిక్షణని, ఆర్థికంగా వేస్తున్న ప్రణాళికల్ని, తీసుకొస్తున్న ఫలితాల్ని మనసారా అభినందిస్తున్నాను. మిగతా రెంటి మీదా – మానవాభివృద్ధి ద్వారా ఉత్పాదకతని పెంచటం, పాలనా సంస్కరణల ద్వారా ఆర్థిక ప్రగతికి అవరోధాలని తొలగించటం – వీటిపైన దృష్టి పెట్టాలి ఎన్నికలయ్యాక ఏ ప్రభుత్వం ఉన్నా దీర్ఘకాలం మీద దృష్టి పెట్టాలి. మన విశ్లేషణ కేవలం అంకెలకు పరిమితం కాకూడదు. మన కుటుంబాల్లో డబ్బు ఎలా చూసుకుంటామో, అభివృద్ధికి తగిన విధానాలను ఎలా అవలంబిస్తామో ఎలా చూసుకుంటామో, ఆదాయాలు ఎలా పెంచుకుంటామో, బడ్జెట్ ఎలా రూపొందించుకుంటామో, పొదుపు ఎట్లా చేస్తామో, అలాగే మన ప్రభుత్వాలు కూడా చేయాలి. కుటుంబాలకు వర్తించే సూత్రాలే ఒక కంపెనీకి వర్తిస్తాయి, ఒక ప్రభుత్వానికి వర్తిస్తాయి. ఆ మార్పులు జరుగుతాయని ఆశిస్తూ, మరోసారి ఆర్థికమంత్రికి అభినందనలు.

❖

# అభ్యసనా సామర్థ్యాల మెరుగుదలపై.. డిజిటల్ నైపుణ్యాల ప్రభావం!





**'బియాండ్ బేసిక్స్' పేరిట రూపొందించిన అసర్-2023 నివేదికను జనవరి 17వ తేదీన న్యూఢిల్లీలో అసర్ భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు విడుదల చేశారు. గ్రామీణ భారతదేశంలో నివశిస్తున్న 14-18 వయోవర్గంలోని కౌమార, యువతపై 'బియాండ్ బేసిక్' దృష్టి సారించింది. గ్రామీణ భారతదేశంలోని పిల్లల పాఠశాల నమోదు, వారి అభ్యసనా సామర్థ్యాల గురించి తెలుసుకోవడానికి పౌర సమాజమే జాతీయ స్థాయిలో నిర్వహించే ఇంటింటి సర్వేగా 'అసర్' పేరు పొందిన విషయం తెలిసిందే. తొలుత 2005లో ప్రారంభించిన అసర్ సర్వే ప్రతీ ఏటా క్రమంతప్పకుండా 2014 వరకూ కొనసాగింది. ఆ తర్వాత 2016 నుండి ప్రతీ రెండవ ఏటా అసర్ సర్వే జరుగుతూ వచ్చింది. వార్షిక విద్యాస్థితిగతుల నివేదిక రూపొందించే క్రమంలో గ్రామీణ భారతదేశంలోని 3-16 వయోవర్గంలోని పిల్లలు ప్రీస్కూలులో గానీ, పాఠశాలలో గానీ నమోదయ్యిందీ లేనిదీ పరిశీలించడం జరిగేది. అలాగే 5-16 వయో వర్గంలోని పిల్లల పఠన, గణిత సామర్థ్యాలను అంచనా వేయడం జరిగేది. కాలక్రమేణా అసర్ మరింత లోతుగా పిల్లల వేర్వేరు సామర్థ్యాలను తెలుసుకుంటూ వచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు ఆరువందల గ్రామీణ జిల్లాల్లోని పద్దెనిమిదివేల గ్రామాల్లో మూడున్నర లక్షల గృహాల్లో 'అసర్' వలంటీర్లు ఇంటింటి సర్వే ద్వారా సమాచారాన్ని సేకరించి క్రోడీకరించి అసర్ నివేదిక రూపకల్పన చేస్తూ వచ్చారు.**

ప్రతీ ఏటా జరిగే అసర్‌కు భిన్నంగా 'అసర్-2023 బియాండ్ బేసిక్స్' జరిగింది. దేశంలోని 26 రాష్ట్రాలలోని 28 గ్రామీణ జిల్లాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో 14-18 వయోవర్గంలోని(కౌమార యువత) 34,745 మందిని కలిసి అభ్యసనా సామర్థ్యాలను మించి వారికి గల కొన్ని సామర్థ్యాలను గురించి తెలుసుకునే ప్రయత్నం చేసింది. గ్రామీణ యువత ఎటువంటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉంటున్నదీ తెలుసుకున్నది. గ్రామీణ యువతకు గల డిజిటల్ అవగాహన గురించి పరిశీలించింది. వారికి గల డిజిటల్ నైపుణ్యాలను అధ్యయనం చేసింది. గ్రామీణ యువతలో స్మార్ట్‌ఫోన్లు సొంతంగా కలిగి ఉన్నవారెందరు, వారు వాటిని ఎందుకు వినియోగిస్తున్నారు..స్మార్ట్ ఫోనుతో చిన్న చిన్న పనులు చేసుకోగలుగుతున్నారా వంటి అంశాలపై బియాండ్ బేసిక్స్ దృష్టి సారించింది.

### అసర్ -2023 నివేదిక నిర్ధారణలు

యువత ఏం చేస్తోంది : గ్రామీణ భారతదేశంలోని 14-18 వయోవర్గంలోని యువత 86.8 శాతం విద్యాసంస్థల్లో నమోదై ఉంది. పాఠశాల నమోదులో కొద్దిపాటి లింగ వ్యత్యాసాలు కొనసాగుతున్నాయి. వయసు పెరిగే కొద్దీ ఈ వ్యత్యాసాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. ఉదాహరణకు 14 ఏళ్ల వయసులో బడి బైటి పిల్లలు 3.9 శాతం మాత్రమే ఉండగా, 18 ఏళ్ల వయసులో బడిబైటి పిల్లలు 32.6 శాతం ఉన్నారు. వయసు పెరిగే కొద్దీ బడినుండి వైదొలుగుతున్న పిల్లల శాతం పెరుగుతూ వచ్చింది. ఎక్కువ మంది యువత ఆర్ట్స్, హ్యుమానిటీస్







కోర్సులలో చేరుతున్నారు. ఇంటరు అంతకు పై తరగతుల్లో ఆర్ట్స్, హ్యూమానిటీస్ కోర్సులలో నమోదైన వారు 55.7 శాతం ఉండడం విశేషం. సైన్సు, టెక్నాలజీ, ఇంగ్లీషు, మ్యాథ్స్ సబ్జెక్టులున్న కోర్సులలో చేరుతున్న వారిలో మగ పిల్లలు 36.3శాతం కాగా, ఆడపిల్లలు 28.1శాతం మాత్రమే ఉన్నారు. సర్వే చేసిన వారిలో 5.6శాతం మాత్రమే తాము ఏదో ఒక రకమైన వృత్తి శిక్షణ కోర్సులలో ఉన్నామని తెలిపారు. వారి శిక్షణా కాలం ఆరు నెలలలోపు ఉన్నట్టు వెల్లడించారు. కళాశాల స్థాయిలో ఉన్న యువతలో వృత్తి విద్యా శిక్షణ పొందుతున్న వారు 16.2శాతంగా ఉన్నారు.

సర్వే జరగడానికి ముందటి నెలలో ఇంటి పనులు కాకుండా ఇతర రకాల పనులు 15 రోజులు తగ్గకుండా చేశామని 40.3శాతం మగ పిల్లలు చెప్పగా, పనులకు వెళ్లామని చెప్పిన ఆడపిల్లలు 28 శాతం ఉన్నారు. ఇంటిపని కాకుండా ఇతర పనులు చేశామని చెప్పిన వారిలో అత్యధికులు తమ సొంత పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లారని వెల్లడయ్యింది.

**యువత సామర్థ్యాలు**

సర్వేలో భాగంగా యువతకు ఐదు రకాల అభ్యాసాలు ఇచ్చారు. అందులో వారికి పఠనం, గణితం, ఆంగ్లభాషల్లో గల సామర్థ్యాలను పరిశీలించడం జరిగింది. రోజువారీ లెక్కలు చేయడంలో తమకున్న ప్రాథమిక సామర్థ్యాలను వారు వినియోగిస్తున్న తీరును తెలుసుకోవడం జరిగింది. లిఖిత పూర్వకంగా ఉన్న సూచనలను చదివి అర్థం చేసుకోవడంలో వారికి గల సామర్థ్యాన్ని పరిశీలించడం జరిగింది. నిజజీవితంలో అవసరమైన ఆర్థికవ్యవహారాలకు సంబంధించిన లెక్కలను చేయగలిగేదీ లేనిదీ పరిశీలించడం జరిగింది.

14-18 వయోవర్గంలోని దాదాపు 25శాతం మంది తమ ప్రాంతీయ భాషలోని 2వ తరగతి స్థాయి పాఠాన్ని చదవలేపోయారు. ఆ వయసులో కూడా భాగహారం చేయలేని వారు సగంమంది ఉన్నారు. మూడంకెల సంఖ్యను ఒక అంకెతో చేసే భాగహారం సరిగ్గా చేసినవారు 43.3 శాతం మాత్రమే. మూడు, నాలుగు తరగతుల్లోనే పిల్లలకు భాగహారం చేయగలిగే సామర్థ్యం అలవడాల్సి ఉంది.

ఇంగ్లీషు వాక్యాలను చదవగలిగిన వారు 57.3శాతం ఉన్నారు. ఇంగ్లీషు వాక్యాల్ని చదవగలిగిన వారిలో వాటి అర్థాన్ని చెప్పగలిగిన వారు73.5 శాతం ఉన్నారు. మాతృభాషలో 2వ తరగతి పాఠ్యాంశాన్ని చదవగలిగిన వారిలో ఆడపిల్లలు 76శాతం కాగా, మగ పిల్లల్లో 70.9శాతం మాత్రమే చదవగలిగారు. అయితే ఆంగ్లం చదవడంలో, గణితం చేయడంలో మగ పిల్లలే మెరుగని వెల్లడయ్యింది.

రోజువారీ జీవితంలో అందరూ కొన్ని లెక్కలు చేసుకోవాల్సి ఉంటుంది. 14-18 వయోవర్గంలోని యువత అలాంటి అభ్యాసాలను చేయగలిగేదీ లేనిదీ అసర్-2023 పరిశీలించింది. ఒక స్కేలును ఉపయోగించి పొడవును కొలవడం గురించిన అభ్యాసం ఇవ్వగా ప్రారంభ స్థానం సున్నా దగ్గర్నుంచి ఇచ్చినపుడు 85శాతం మంది సరిగ్గానే కొలిచారు. ప్రారంభ స్థానం మార్చినపుడు సరిగ్గా కొలవగలిగిన వారు 39శాతం మాత్రమే. అలాగే ఇతర సాధారణ లెక్కలు చేయగలిగిన వారు దాదాపు 50శాతం మాత్రమే అని తేలింది.

యువతకు ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్టును చూపించి దానిపై ఉన్న సమాచారం గురించి కొన్ని ప్రశ్నలు అడగడం జరిగింది. కనీసం ఒకటో తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవగలిగిన వారినే ఈ ప్రశ్నలు వేయడం జరిగింది. అడిగిన నాలుగు ప్రశ్నల్లో మూడు ప్రశ్నలకు జవాబు చెప్పగలిగినవారు మూడింట రెండు వంతుల మంది ఉన్నారు.

అసర్ పరీక్షాపత్రం ద్వారా తీసివేతలు చేయడం వచ్చిన వారిలో రోజువారీ జమాఖర్చులు లెక్కించగలిగే వారెందరని తెలుసుకునే ప్రయత్నం జరిగింది. రోజువారీ జమా ఖర్చులు రాయగలిగే వారు 60 శాతం ఉన్నారు. కొనుగోళ్లపై ఇచ్చే రాయితీని లెక్కంచగలిగేవారు 37శాతం మాత్రమే ఉన్నారు. కేవలం 10శాతం మాత్రమే రీపేమెంటు లెక్కను చేయగలిగారు. రోజువారీ లెక్కలను, సూచనలను అర్థం చేసుకోవడంలో బడిలో

# డిజిటల్ అవగాహన-నైపుణ్యాలు

14-18 వయోవర్గంలోని యువత స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించి చేయగలిగే కొన్ని అభ్యాసాలను సర్వే సందర్భంగా తెలుసుకోవడం జరిగింది. సర్వే బృందం ఎదుట యువత చేసిన అభ్యాసాల ద్వారా వారికి గల డిజిటల్ అవగాహన, అందులో వారికి గల నైపుణ్యాలు వెల్లడయ్యాయి.

గ్రామీణ ప్రాంతాలలోని 14-18 వయోవర్గంలోని యువతకు సంబంధించి 90 శాతం కుటుంబాల్లో స్మార్ట్‌ఫోన్ ఉన్నది. స్మార్ట్‌ఫోన్ ఉపయోగించడం వారికి వచ్చు. స్మార్ట్‌ఫోన్ ఉపయోగించడం వచ్చిన వారిలో సొంతంగా స్మార్ట్‌ఫోన్ ఉన్న మగ పిల్లలు 43.7 శాతం కాగా, ఆడపిల్లల్లో 19.8శాతం మాత్రమే స్మార్ట్‌ఫోన్ సొంతంగా కలిగి ఉన్నారు. అలాగే మగ పిల్లలతో పోల్చినపుడు స్మార్ట్ ఫోన్, కంప్యూటర్ వినియోగించడంలో ఆడపిల్లలు బాగా వెనుకబడి ఉన్నారు.



సర్వే జరిగిన రోజుకంటే ముందు వారం రోజుల్లో సోషల్ మీడియాను వినియోగించిన యువత 90.5శాతం కాగా అందులో మగపిల్లలు 93.4శాతం ఉండగా, ఆడపిల్లలు 87.8శాతం ఉన్నారు. సోషల్ మీడియాని వినియోగిస్తున్న వారిలో సగం మందికి మాత్రమే ఆన్‌లైన్ భద్రత గురించిన సెట్టింగ్సుపై అవగాహన ఉంది. ఈ విషయంలో కూడా ఆడపిల్లలు బాగా వెనుకబడి ఉన్నారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగించిన వారిలో మూడింట రెండు వంతుల మంది విద్యా సంబంధ కృత్యాల కోసం వినియోగించామని చెప్పడం విశేషం. తమ చదువులకు సంబంధించిన వీడియోలను చూశామని, సందేశాల నివృత్తి కోసం స్మార్ట్‌ఫోన్ వినియోగించామని, తోటి పిల్లలతో నోట్సును పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడానికి స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించినట్లు వెల్లడించారు. అలాగే బడిబైట ఉన్న 14-18 వయోవర్గం పిల్లలు కూడా తమ స్మార్ట్‌ఫోన్లను విద్యా సంబంధ కృత్యాల కోసమే వినియోగించినట్లు వెల్లడించారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న వారిలో దాదాపు 25శాతం మంది ఆన్‌లైన్ సేవల కోసం స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించడం జరిగిందని చెప్పారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సేవలలో బిల్లుల చెల్లింపు, నగదు బదిలీ, టిక్కెట్టు కొనుగోలు అవసరమైన పత్రాలను నింపడం వంటి కృత్యాలున్నాయి. స్మార్ట్‌ఫోన్లను సినిమాలు చూడటం, సంగీతం వినడం వంటి వినోద కార్యక్రమాల కోసం వాడుతున్నామని 80శాతం యువత వెల్లడించారు.

యువతకు గల డిజిటల్ సామర్థ్యాలను, నైపుణ్యాలను తెలుసుకోవడానికి మంచి కనెక్టివిటీ కలిగిన స్మార్ట్‌ఫోన్‌ను తీసుకు రావాల్సిందిగా అసర్ సర్వే బృందం యువతను కోరింది. తమ సొంత ఫోను లేదా కుటుంబ సభ్యుల ఫోనుగానీ, పొరుగువారి ఫోనును గానీ తేవాల్సిందిగా సర్వే బృందం అడిగింది. మూడింట రెండు వంతుల మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్‌ను తీసుకురాగలిగారు. అలా తెచ్చిన వారిలో మగ పిల్లలు 72.9శాతం ఉండగా, ఆడ పిల్లలు 62 శాతం మాత్రమే ఉన్నారు.

స్మార్ట్‌ఫోన్ తెచ్చిన వారిలో ఫలానా వీడియోని కనుగొనగలిగిన వారు 80 శాతం కాగా, అదే వీడియోని స్నేహితులకు పంపగలిగిన వారు 90శాతం ఉన్నారు. ఒక ప్రశ్నకు సమాధానం కనుక్కోవడానికి ఇంటర్నెట్‌ను వెతకగలిగిన వారు 70శాతం ఉన్నారు. తమకు అవసరమైన సమయానికి అలారంను పెట్టగలిగిన వారు మూడింట రెండు వంతుల మంది ఉన్నారు. గూగుల్ మ్యాప్‌ను వినియోగించి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లడానికి పట్టే సమయాన్ని చెప్పగలిగిన వారు మూడో వంతు మంది ఉన్నారు.

స్మార్ట్‌ఫోన్ వినియోగించి చేయించిన అభ్యాసాల్లో, కృత్యాల్లో ఆడపిల్లలకంటే మగ పిల్లలు బాగా రాణించారు. విద్యాస్థాయి పెరిగే కొద్దీ డిజిటల్ అవగాహన మెరుగ్గా ఉంటుంది. ప్రాథమిక పఠన సామర్థ్యాలు బాగున్న వారు డిజిటల్ కృత్యాలను మెరుగ్గా చేయగలుగుతారు.

వారు నేర్చుకునే పఠనం, గణితం, సామర్థ్యాలు ఎంతగానో వినియోగపడతాయని సర్వేలో ఇచ్చిన అభ్యాసాల్ని బట్టి వెల్లడయ్యింది.

'బియాండ్ బేసిక్' పేరిట అసర్-2023 నివేదిక విడుదల అయిన తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. అసర్ నివేదికలో వెల్లడైన అంశాలను బట్టి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించింది. 'బియాండ్ బేసిక్స్' సర్వే మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో జరిగింది. నాందేడ్ జిల్లాలో 16-18 వయోవర్గం పిల్లల్లో 65శాతం చిన్నపాటి భాగహారం చేయలేకపోయినట్లు, 45శాతం ఆంగ్ల పాఠ్యాంశంలోని వాక్యాలను చదవలేకపోయినట్లు అసర్-2023 సర్వే వెల్లడించింది.

దీనిపై స్పందించిన విద్యాశాఖ తాజాగా మార్గదర్శకాలను విడుదల చేస్తే విద్యాశాఖ యంత్రాంగం పిల్లల అభ్యసనా సామర్థ్యాల ప్రగతిని నిరంతం సమీక్షించాలని, అధికారులు తరచూ తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించాలని, పిల్లలతో, ఉపాధ్యాయులతో సంభాషించి బోధనాభ్యాసన ప్రక్రియను మెరుగు పరచడంపై దృష్టి సారించాలని ఆదేశించింది.

❖

# అందరికీ అనువుగా విద్యా చట్రాన్ని సరళతరం చేయాలి

|| డాక్టర్ మాధవ్ చవాన్ ||

విద్యా సెస్సును విధించాలని 2004లో యూపీఏ ప్రభుత్వం ఒక విధాన నిర్ణయం తీసుకున్న తర్వాతనే 'అసర్' ఆలోచన పుట్టింది. ప్రాథమిక విద్యపై ప్రభుత్వం చేస్తున్న వ్యయం ప్రభావాన్ని కొలవడానికి అసర్ ప్రయత్నించింది. పాఠశాల నమోదు, పిల్లల అభ్యసనా సామర్థ్యాలు, పాఠశాలల స్థితిగతులు వంటి అంశాలను 'అసర్' నివేదికలు వెలుగులోకి తెచ్చాయి. అసర్ ప్రయత్నం ప్రారంభమైన పదేళ్ల తర్వాత విభిన్న వయోవర్గాల పిల్లల చదువులతో పాటు వారి ఇతర సామర్థ్యాలను కూడా పరిశీలించడం జరిగింది. ప్రభుత్వం చేస్తున్న వ్యయానికి తగిన ఫలితాలు వస్తున్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు ప్రారంభమైన ప్రయత్నం కాలక్రమంలో వస్తున్న మార్పులు, వాటి ప్రభావం వైపు మరలింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి విరుచుకుపడిన అనంతరం పిల్లల చదువులపై పడ్డ ప్రభావాన్ని పూర్తిగా మారిపోయిన స్థితిగతులను 'అసర్' పరిశీలించింది. అభ్యసనా సామర్థ్యాల స్థాయి పడిపోవడం, అభ్యసనంలో ఏర్పడిన లోటు, ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల వైపు భారీ ఎత్తున సాగిన వలసలు వంటి అంశాలు అసర్ నివేదికల్లో ప్రతిబింబించాయి. స్మార్ట్‌ఫోన్లు కలిగి ఉన్న కుటుంబాలు 2018లో 36శాతం ఉండగా, 2022 నాటికి 74శాతానికి పెరిగిన పరిణామం ప్రధానమైనదిగా ముందుకు వచ్చింది.

స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావడమనే పరిణామం నిరంతరం విస్తృతం కావడం గమనిస్తున్నాం. నిజానికి 2022 అసర్ గణాంకాలను 2023 అసర్‌తో పోల్చడానికి వీల్లేదు గానీ, స్మార్ట్‌ఫోన్ల వినియోగం విషయంలో వెల్లడైన గణాంకాలు మాత్రం అందులో వచ్చిన భారీ మార్పును వెల్లడించాయి. దేశంలో 83శాతం యువతీ, యువకులు తమ ఇంటిలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉందని వెల్లడించారు. తమకు స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించడం తెలుసని 92శాతం యువతీ, యువకులు తెలిపారు. అంతే కాకుండా స్మార్ట్‌ఫోన్ అందుబాటు విషయంలో 14-18 వయోవర్గపు యువతలో ఆడా, మగా తేడా లేదని స్పష్టంగా వెల్లడైంది.

స్మార్ట్‌ఫోన్ అందుబాటు పెరగడం పెద్ద పరిణామమే గానీ, విద్యా రంగానికి, పిల్లల అభ్యసనానికీ అదెంత వరకూ పనికొస్తుందనేది ప్రశ్న. అసర్-2023 సందర్భంగా చేసిన సర్వేలో 90శాతం కుటుంబాలలో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయని వెల్లడైంది. సర్వే చేసిన యువతలో 94.7శాతం మగపిల్లలకి, 89.8శాతం ఆడపిల్లలకి స్మార్ట్ ఫోన్‌ను ఎలా ఉపయోగించాలో తెలుసు. అందులో



మగపిల్లలు సొంత స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నవారు 43.7శాతం కాగా ఆడపిల్లల్లో సొంత స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నవారు 19.8శాతం మాత్రమే.

సొంతంగా స్మార్ట్‌ఫోన్లును కలిగి ఉండటంలో కన్పించిన లింగ వ్యత్యాసం సామర్థ్యాలను ప్రభావితం చేస్తుందనేది గమనార్హమైన అంశం. మగపిల్లల విషయంలో స్మార్ట్‌ఫోన్ సొంతంగా ఉన్నా లేకున్నా అసర్ సర్వే సందర్భంగా చేయించిన కృత్యాలు చేయడంలో వారికేమీ ఇబ్బంది కలగలేదు. స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించి సమాచారాన్ని తెలుసుకునే విషయంలో మగపిల్లల సామర్థ్యం బాగానే ఉంది. ఆడపిల్లల విషయానికి వస్తే సొంత స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నవారికంటే సొంతంగా స్మార్ట్‌ఫోన్ లేని ఆడపిల్లలకు అననుకూలత కొట్టొచ్చినట్టు కన్పించింది. సొంత స్మార్ట్‌ఫోన్ లేని ఆడపిల్లలు కొంత నష్టపోతున్నారు. అయితే విద్యావసరాల కోసం స్మార్ట్‌ఫోన్ వినియోగించే విషయంలో ఆడపిల్లలకు, మగపిల్లలకు మధ్య ఎలాంటి లింగ వ్యత్యాసం కన్పించలేదని అసర్-2023 నివేదిక తెలిపింది.

యూట్యూబ్‌లో ఏదైనా ఒక వీడియోను కనుగొనే విషయంలో మగపిల్లలు 86.4శాతం, ఆడపిల్లలు 85.1శాతం విజయవంతం అయ్యారు. అయితే సొంతంగా స్మార్ట్‌ఫోన్ లేని ఆడపిల్లలు 76.4శాతం మాత్రమే ఆ పనిచేయగలిగారు. ఒక వీడియోని కనుగొని, దాన్ని తమ స్నేహితులకు షేర్‌చేసే విషయంలో మగపిల్లలు 81.6శాతం ఆడపిల్లలు 77.7శాతం చేయగలిగారు. కానీ సొంత స్మార్ట్‌ఫోన్‌లేని ఆడపిల్లలు 62.9శాతం మాత్రమే


షేర్ చేయగలిగారు. తమ మొబైల్లో ఒక నిర్దిష్ట సమయానికి అలారం పెట్టగలిగే సామర్థ్యం మగ పిల్లల్లో 78.2శాతం, ఆడపిల్లల్లో 71.5శాతం మందికి ఉంది. అయితే సొంత స్మార్ట్‌ఫోన్‌లేని ఆడపిల్లల్లో అలారం పెట్టే విషయంలో 54.2శాతం మాత్రమే విజయవంతం అయ్యారు. గూగుల్ మ్యాప్‌ను వినియోగించి తమ ఇంటినుండి వేరే ప్రదేశానికి దూరం కనుగొనే విషయంలో మగపిల్లలు 57.5శాతం, ఆడపిల్లలు 21.7శాతం మాత్రమే ఆ కృత్యాన్ని చేయగలిగారు. ఇలాంటి సామర్థ్యం పిల్లలకు వయసు పెరిగే కొద్దీ మెరుగ్గా ఉంది.

సర్వేలో పాల్గొన్న యువతలో దాదాపు 90శాతం మంది సర్వే జరగడానికి ముందు వారంలో సోషల్ మీడియాను వినియోగించామని చెప్పారు. అయితే అందులో సొంతంగా స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నవారికి మాత్రమే సేఫ్టీ సెట్టింగ్స్‌ను వాడటం తెలుసని సర్వేలో వెల్లడయ్యింది. పిల్లలు బ్రౌజింగ్ చేయడానికి, సమాచారాన్ని పొందడానికి, సేవలను పొందడానికి స్మార్ట్‌ఫోన్ సొంతానికి కలిగి ఉండటమనేది చాలా ముఖ్యం అని సర్వే వెల్లడించింది.

విద్యకు సంబంధించిన ఇతర నైపుణ్యాల మాదిరిగానే స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించే నైపుణ్యం విషయంలో వారికి తగిన ప్రేరణ, ప్రోత్సాహం అవసరం. దాంతో పాటు స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉండటం, అభ్యసనానికి అవకాశాలు ఉండటం చాలా కీలకం. స్మార్ట్‌ఫోన్‌లో లభిస్తున్న వినోదం గొప్ప ప్రేరణనిస్తోంది. వాట్సాప్, యూట్యూబ్ వంటివి యువతను నూతన సాంకేతికను నేర్చుకునేటట్లుగా బలంగా ప్రేరేపించాయి. సాంకేతికతను అలవరచుకునేవిధంగా తోడ్పడ్డాయి. అందులో లింగవివక్ష లేదు. అయితే ఆన్‌లైన్ సేవలు పొందడం, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించడం విషయంలో ఆడపిల్లలు వెనుకబడి ఉన్నారు. ఆడపిల్లల వెనుకబాటుకు సాంకేతిక అవరోధాలకంటే సామాజిక అవరోధాలు ఎక్కువ పాత్ర పోషిస్తున్నాయని చెప్పాలి.

అవి ఎలాంటిదైనా సరే, ఒక్కసారంటూ సాంకేతికత ప్రేరణ పొందిన వారి చేతులలోకి వస్తే, అవరోధాలను, పరిమితులను అధిగమించి దాన్ని వినియోగించుకోవడాన్ని నేర్చుకుంటారు. కరోనా మహమ్మారి వచ్చి పడిన కాలంలో ఎవరూ నేర్పాల్సిన అవసరం లేకుండానే జనాభాలో అత్యధిక సంఖ్యాకులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకున్నారు. తమకు అవసరమైన పనులను చేసుకోగలిగారు. వినియోగ అనుకూల అప్లికేషన్లను సునాయాసంగా వినియోగించుకున్నారు. కరోనా కంటే ముందు కూడా ఎవరూ నేర్పకుండానే పిల్లలు నైపుణ్యాలను సాధించగలరన్న ఒక ఉదాహరణ మన ముందున్నది.

11-14 వయోవర్గం పిల్లల చిన్న బృందాలకు ఒక్కొక్క 'టాబ్లెట్'ను అందించే ప్రయోగాన్ని 2017లో చేయడం జరిగింది. పరికరాన్ని సురక్షితంగా ఉంచే బాధ్యతను తల్లులకు ఇవ్వడం జరిగింది.. పరికరం పాడైనా, పోయినా జరిమానా



ఉండదన్న హామీతోనే తల్లులకు అప్పగించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 400 గ్రామాల్లోని పిల్లల బృందాలకు 3000 టాబ్లెట్‌లను పంపిణీ చేశారు. ట్యాబ్‌లో అందుబాటులో ఉన్న సమాచారం తప్ప ఇతర సమాచారాన్ని పొందడానికి వీలు లేకుండా ఒక పాస్‌వర్డ్‌ను ఏర్పాటు చేస్తారు. పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన రెండు వారాల్లోపే సగం పరికరాల్లోని పాస్‌వర్డ్‌లన్నీ మారిపోయాయి. పర్యవేక్షణ చేస్తున్న ప్రథమ్ వలంటీర్లు గ్రామాలకు వెళ్లి చూసి ఆశ్చర్యపోగా, పిల్లలు వారిని చూసి నవ్వుకోవడం జరిగింది. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లు వంటి పరికరాలతో గ్రామీణ పిల్లలకు ఎంతమాత్రమూ పరిచయం లేని రోజుల్లోనే ఇలాంటి పరిణామం సంభవించింది. అందులో కొంతమందికి పాస్‌వర్డ్‌ను మార్చడమెలాగో తెలుసు. వారు మార్చేశారు. ఆ విషయం మొత్తం పిల్లలందరికీ కార్చిచ్చులా వ్యాపించింది. దాంతో మొత్తం పిల్లలంతా పాస్‌వర్డ్‌ను మార్చడమెలాగో తెలుసుకుని, అమల్లో పెట్టేశారు. ఇందులో ఆసక్తికరమైన ప్రశ్న ఏమిటంటే అన్ని బృందాలూ ఆపనిని ఎందుకు చేయకలేకపోయాయని తర్వాత మేం అన్ని ట్యాబ్‌లలోని పాస్‌వర్డ్‌లను తొలగించాం. ట్యాబ్‌లలోని సమాచారానికి భద్రత కల్పించే బాధ్యతను పిల్లలకే అప్పగించాం. అక్కడక్కడా అప్పుడప్పుడూ తప్పులు జరిగినా మొత్తం మీద పిల్లలు బాధ్యతగా వ్యవహరించారు.

ఈ ప్రయోగంలో ట్యాబ్‌పై యాజమాన్యం ఉమ్మడిగా బృందానికే ఇచ్చారు. పిల్లలు పరికరాన్ని ఒకరి తర్వాత ఒకరు వనియోగించుకునేటట్లు ఏర్పాటు చేశారు. ట్యాబును పిల్లలు తమకు నచ్చిన రీతిలో వినియోగించుకునేటట్లు, ఆడుకునేటట్లు అవకాశం కల్పించారు. పిల్లలు తమంతట తాముగానూ, తోటివారి నుండి ట్యాబును వినియోగించుకోవడాన్ని నేర్చుకున్నారు. ప్రథమ్ సిబ్బంది కూడా తోడ్పడ్డారు. ఈ ప్రయోగంలో వేర్వేరు దశలున్నాయి. పిల్లలు వీడియోను చిత్రీకరించడం, ఎడిటింగ్ చేయడం, షేర్ చేయడం, అప్‌లోడ్ చేయడం వంటివన్నీ చేయగలిగారు. మొత్తం బృందనాయకులు 4,394 మందిలో ఒక దశలో 49శాతం నాయకులుగా ఆడపిల్లే



ఉన్నారు. గ్రామీణ నేపథ్యంలో చేసిన ఈ ప్రయోగంలో అందరికీ పరికరాన్ని అందుబాటులో ఉంచడం, ఆడ, మగా పరిమితులను తొలగించి అందరూ సమానంగా వినియోగించే అవకాశాన్ని ఇవ్వడం జరిగింది. సమాన అవకాశాలు ఇచ్చి వినియోగించమనడంతో ఆడపిల్లఉ కూడా తమ సామర్థ్యాలను వ్యక్తం చేయగలిగారు వారి అవకాశాలను నియంత్రించిన సందర్భాల్లో ఆడపిల్లల అభ్యసనా సామర్థ్యాలు ప్రతికూలంగా ప్రభావితమయ్యాయని ఈ ప్రయోగం రుజువు చేసింది.

అసర్-2023 సర్వే సందర్భంగా కూడా అందుబాటు, వినియోగం, యాజమాన్యంలోని పరిమితుల కారణంగా ఆడపిల్లలు అభ్యసనంలో వెనుకబడ్డారని తేలింది. ప్రతి స్వేచ్ఛలోనూ అవకాశంతో పాటు కష్టనష్టాలు కూడా ఉంటాయి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ చాలా విస్తృతంగా అందుబాటులోకి వచ్చింది. డేటా కూడా చవకగా దొరుకుతుంది. దీనివల్ల సమాచారాన్ని వక్రీకరించే ప్రమాదం పెద్ద సవాలుగా ముందుకొచ్చింది. పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ నేర్పని విద్యను నేర్చుకోవడానికి అదొక అవకాశాన్ని కూడా తీసుకువచ్చింది. లైంగిక, పునరుత్పత్తి సంబంధ అవగాహనను పెంచడానికి ఐ.సి.డి.ఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సాగించే ప్రయత్నాలకు సాంకేతికతతో బాగా వినియోగపడుతుంది.

వ్యవసాయం, ప్రకృతి వనరుల వనియోగం వంటి అంశాలను నేర్పడానికి కూడా సాంకేతికత వినియోగించవచ్చు. అసర్-2023 సర్వేలో 56.4శాతం గ్రామీణ యువత హ్యూమానిటీస్ కోర్సుల్లో ఉండగా, 31.3శాతం మాత్రమే సైన్సు కోర్సుల్లో ఉన్నారని వెల్లడయ్యింది. అందులో కేవలం 0.7శాతం మాత్రమే వ్యవసాయ కోర్సుల్లో ఉన్నారు. మనదేశంలో దాదాపు 50శాతం శ్రామిక శక్తి వ్యవసాయరంగంలో నిమగ్నమైంది. అదే విధంగా 14-18 వయోవర్గం పిల్లల్లో దాదాపు 25శాతం తమ సొంత పొలంలో వ్యవసాయ పనులకు వెళ్తున్నారని అసర్-2023 సర్వేలో వెల్లడయ్యింది. ఈ నేపథ్యంలో మనం మన పిల్లలకు వ్యవసాయం, చేపల సాగు, అటవీ సంరక్షణ




వంటి అంశాలలో పరిజ్ఞానాన్ని, ఆధునిక నైపుణ్యాలను నేర్పడానికి శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. వారు తమ కుటుంబాల నుండి సంప్రదాయకంగానే అలాంటి శిక్షణ పొందుతారు. కానీ మారిన పరిస్థితులకు అది చాలదు. ఇది కేవలం ఉద్యోగాలకు, జీవనోపాధులకు నైపుణ్య శిక్షణ మాత్రమే కాదు. సహజవనరుల నిర్వహణ అనేది పర్యావరణ, వాతావరణ సమస్యలతో ముడిపడిన అంశం. వీటి మధ్య ఉన్న పరస్పర సంబంధంపై ఇప్పుడు మనకు మెరుగైన అవగాహన ఉంది. కేవలం వ్యవసాయాధార కుటుంబాలు మాత్రమే కాకుండా మొత్తం సమాజమంతా వ్యవసాయం గురించి, పర్యావరణం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది. ప్రతి ఇంటికీ దగ్గర్లోనే ఒక ప్రయోగశాల ఉండాలి. అందులో ప్రయోగాలు చేయడానికి, నేర్చుకోవడానికి తగిన ఏర్పాట్లు ఉండాలి. డిజిటల్ సాంకేతికత ద్వారా నేర్చుకోవడానికి, జ్ఞానాన్ని, సమాచారాన్ని పొందడానికి జనం ఉన్న ప్రదేశాలన్నిటా అవకాశాలు కల్పించాలి. అందుకు ప్రస్తుతం ఉన్న విశ్వవిద్యాలయాలు, శాఖలు కఠిన చట్టంతో ఏర్పాటైన తరగతి గదులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఏర్పాట్లు ఒక్కటే చాలవు.

దేశంలో మరిన్ని విశ్వవిద్యాలయాల అవసరం గురించి చాలా మాటలు వింటూ ఉంటాం. రానున్న నలభై ఏళ్లలో వృద్ధి చెందుతూ పోయే జనాభాకు నేరుగా ముడిపడిన అంశం ఇది. అయితే పెరుగుతున్న కొత్త అవసరాలకు అనుగుణంగా నియత విద్యతో పాటు 'అనియతి విద్య' అవసరం కూడా ఎంతో ఉంది. రెండు దశాబ్దాల క్రితం కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటివి విద్యను విప్లవాత్మకంగా మార్చేస్తాయన్న ఆశ ఉండేది. ఒక దశాబ్దం తర్వాత మొబైల్ వచ్చింది. ఎవరు ఎక్కడున్నా, ఎప్పుడైనా విద్యను నేర్చుకునే వీలు కుదిరిందని అనుకున్నాం. పుస్తకాల స్థానంలో మొబైల్ ఫోన్ సరిపోతుందనుకున్న స్థితి నుండి ప్రతి బిడ్డకు ఒక ల్యాప్‌టాప్ ఇవ్వాలన్న స్థాయికి చేరుకున్నాం. అసర్-2023 సర్వే ద్వారా మన పిల్లల్లో తమ విద్యాభ్యాసం కోసం స్మార్ట్ ఫోన్ వినియోగించేవారు సగం మంది ఉన్నారని తేలింది. నిజానికి ఈ సంఖ్య ఎక్కువ అనే చెప్పాలి. కానీ యూట్యూబు చూస్తున్న వారి సంఖ్యతో పోలిస్తే ఇదింకా తక్కువగానే ఉంది.

విద్యావసరాలకు సంబంధించిన ఆన్‌లైన్ ఉత్పత్తులు మనకు లాభాపేక్షలేని సంస్థలనుండి, లాభాపేక్షతో పనిచేసే సంస్థల నుండి చాలా వరకూ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కానీ అవన్నీ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్నవే. తాజాగా



కృత్రిమ మేధ సహాయంతో బోధించే కార్యక్రమాలు పెరుగుతున్నాయి. సాంకేతికత నిరంతరం వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో అలాంటి బోధనా కార్యక్రమాలను అన్ని భాషల్లోనూ రూపొందించడం సులభమే. వాటి ధరలు తక్కువగా ఉండే అవకాశం కూడా ఉంది. అయితే వాటి కేంద్రీకరణ అంతా పరీక్షలకు సన్నద్ధం చేయడం మీదనే ఉంది. మార్కెట్ అవసరం కూడా అలాగే ఉంది మరి.

జ్ఞాన సంపాదనకు సాంకేతిక అవరోధాలు క్రమేపీ తొలగిపోతున్నాయి. కానీ జ్ఞానాన్ని బదలాయింపు చేయడం, నేర్చుకున్న జ్ఞానాన్ని ధృవీకరించడం వంటి ప్రక్రియలు ఇంకా కఠినమైన నియంత్రణలోనే ఉన్నాయి. నియంత్రణలను తొలగించాల్సి ఉంది. ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా విద్యార్జన చేయడమనే ఆలోచనను ఇక మనం అమల్లో పెట్టాలి. ఇప్పటికే మనదేశంలో సార్వత్రిక ప్రాథమిక పాఠశాల నమోదును సాధించాం. సెకండరీ, హయ్యర్ సెకండరీ సంస్థలలో సార్వత్రిక నమోదును సాధించే దిశంగా మనం ముందంజ వేస్తున్నాం. కానీ అసర్-2023 నివేదిక చెబుతున్న ప్రకారం 15-16 వయోవర్గంలోని పదో తరగతి పూర్తి చేసిన పిల్లల్లో సగం మంది పార్ట్‌టైమ్ పనిచేస్తున్నారు. నియత విద్యావ్యవస్థలో పిల్లల పాఠశాల ప్రవేశం, పున:ప్రవేశం సరళంగా ఉందని గొప్పగా చెబుతున్నప్పటికీ అలాంటి పరిస్థితి నిజంగా లేదు. యువత జీవనోపాధి కోసం పనిచేసుకుంటూనే చదువుకునే వీలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఓపెన్ స్కూళ్లు, డిజిటల్ సాంకేతికత శక్తివంతమైన సాధనాలుగా వృద్ధి చెందుతున్నాయి. ఓపెన్ స్కూళ్లను, ఓపెన్ యూనివర్శిటీలనూ మరింత వికేంద్రీకరించాలి. వాటి ప్రక్రియలను నిజంగా సరళీకరించి వాటిని బలోపేతం చేయాలి. పెరుగుతున్న సాంకేతికత వల్ల ఏ సమయంలోనైనా, ఎక్కడి నుంచైనా నేర్చే, చదువుకునే, సావకాశం వచ్చింది. అదే విధంగా ఏ సమయంలోనైనా, ఎక్కడి నుంచైనా పరీక్షలు రాసే వీలు కల్పించాలి.

ప్రస్తుతం నడుస్తున్నది 'సమృద్ధి శతాబ్దం', సంపద బహుముఖ రూపాలలో అపారంగా వృద్ధి చెందుతున్నది. ప్రపంచ కుబేరులు ఎలాన్‌మస్క్ వంటి వారు 'సార్వత్రిక ఉన్నత ఆదాయం' అందరికీ లభించడం గురించి మాట్లాడుతున్నారు. కృత్రిమ మేధా యుగంలో సృజనాత్మకంగా ఉండటమే భూగోళంపై మన ఉనికికి సార్థకత అంటూ వెంచర్ క్యాపిటలిస్ట్, కూపూ-లీ అంటున్నారు. సార్వత్రిక కనీస ఆదాయం అనే ఆలోచన వందల సంవత్సరాలుగా ఉన్నది. చేయాల్సిన పని ఎంతో ఉంది. కానీ చేసిన పనికి తగిన వేతనం చెల్లించే ఉద్యోగాలు తగ్గిపోతున్న దశకు మన ప్రపంచం చేరుకున్నది. సార్వత్రిక కనీస లేదా ఉన్నత ఆదాయం గురించి మాట్లాడుతున్నవారంతా, ఉద్యోగాలు లేకపోయినా ఆదాయం వచ్చే మార్గాలు పెరిగితే జీవితానికి ఒక సార్థకత ఉండదేమోనని ఆందోళన చెందుతున్నారు.

జీవితంలో ఏదైనా సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకునే విధంగా పిల్లలకు శిక్షణ ఇచ్చే పద్ధతిలో మన విద్యావ్యవస్థ రూపొందింది. పరీక్షల్లో బాగా రాణించడం, ఉద్యోగం సాధించడం వంటివి నేర్పుతోంది. కానీ కాలం మారుతోంది. బాగా చదవడం, మంచి ఉద్యోగం సంపాదించడం వంటి లక్ష్యాలు మన యువతలో అత్యధికులను ప్రభావితం చేయడం కొనసాగుతుంది. కానీ జీవిత లక్ష్యాలకూ చదువుకూ సంబంధం లేదనే ధోరణి కూడా ప్రాచుర్యం పొందుతోంది. జీవిత లక్ష్యాలను సాధించుకోవడానికి వీలుగా మన వ్యవస్థ యువతకు తోడ్పాటు ఇవ్వాల్సి ఉంది. సాంకేతికత మనకు సహాయం చేయగలదు. కానీ మారాల్సింది మన ఆలోచనా విధానం. ❖

# ‘క్రియ’ పిల్లల పండగ

ఉప్పలపాటి మాచిరాజు



ఒక వార్షిక బాలోత్సవం ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది బడి విద్యార్థులతో ఏటా జరగటం 2047 లక్ష్యం దిశగా అడుగులేస్తున్న భారతదేశానికి ఉత్సాహాన్నిచ్చే దృశ్యం.

పిల్లల పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి/ మూర్తిమత్వానికి దోహదపడేవి, బడిలో వివిధ కారణాల వల్ల జరగని, జరగాల్సిన ప్రక్రియలను, బడికి సహకరిస్తూ ‘క్రియ’ కార్యక్రమం ద్వారా చేద్దామని కాకినాడ తిమ్మాపురం గ్రామం నుంచి కొందరు యువకుల చేసిన సంకల్పం ఇది.

**క్రియ అంటే**.... పనులన్నీ క్రియలు - చదవటం, తినటం, నడవటం, ప్రపంచ పౌరులను తయారుచేయటం.......

మందిహితం కోరి చేసే పనులు క్రియలు. ప్రపంచ మానవ వనరుల కర్మాగారం ఈ క్రియ.

ఈ వయసు పిల్లల ప్రతిభాపాటవాల వెలికితీత, ప్రదర్శనకు వేదిక ఏర్పాటు చేసి ఆ రెండు రోజులు, అవసరాన్ని బట్టి ముందువెనక రోజులు కూడా ఉండటానికి, తినటానికి వసతి ఏర్పాట్లు చేసే ఈ ప్రక్రియ చాలా కోలాహలంగా ఉంటుంది. కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణం బాల్యం పూసిన ప్రాసాదమవుతుంది.

పోటీలకు నిర్ణయించే ప్రతి అంశం అందుకు రూపొందించే నిబంధనలు, గుణనిర్ణేతల నిర్ణయాలు అన్నీ కీలకంగానూ, రాసి, వాసి పరంగానూ ఎంతో అపురూపంగా ఉంటాయి. తెలుగు సాహితీరంగంలో ఎంతో పేరున్నవారు గుణనిర్ణేతలయి ఈ బాల్యప్రాసాదంలో పిల్లలయిపోయి ఆడుకుంటుంటారు. వీరంతా సాయంత్రం సమీక్షకు కూర్చున్నప్పుడు మనం ఆ పిల్లలతో పరిగెత్తడానికి ఎంత కష్టపడాలో వాళ్ల సామర్థ్యాలు ఎంత ఆశ్చర్యాన్ని కలిగిస్తాయో వీరి మాటల్లో వినాల్సిందే.

పదవ క్రియ పిల్లల పండుగ 2023 నవంబర్ 25-26 తేదీలలో జరిగింది. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుండి 10370 మంది పిల్లలతో జేఎన్‌టీయూ ప్రాంగణం కిటకిటలాడింది. కోలాటం ఈ సంవత్సరం కొత్తగా చేర్చిన అంశం.

బుర్రకథ, కోలాటం లాంటి అంతరించిపోతున్న జానపద కళారూపాలు పిల్లలు నేర్చుకుని ప్రదర్శించడం సంతోషదాయకం.

చిత్రలేఖనం, మట్టితో బొమ్మలు, క్రాఫ్ట్ పిల్లల అద్భుత సామర్థ్యాలను ఆవిష్కరించాయి.

నాటికలు, ఏకపాత్ర అభినయాలలో ఆంగిక, సాత్విక, వాచక ప్రతిభను అద్భుత ఆహార్యంతో ఆకట్టుకున్నారు.

కథ చెప్పడం, కథా విశ్లేషణ, కథ రాయడం లాంటి సృజన భావుకులను ప్రేరేపిస్తుంది.

స్పెల్లింగ్, ఇంటర్నెట్ సెర్చ్ భాషాజ్ఞానాన్ని, ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయి.

క్విజ్, డిబేట్ విజ్ఞానాన్ని, ప్రశ్నించే పౌరతత్వాన్ని ఇనుమడింపచేస్తాయి.

**దార్శనికులు, సందర్శకులు:** తెలుగు సాహితీరంగంలో సింహభాగం ఆ రెండు రోజులూ ఇక్కడే ఉంటారు.

ఈ దేశంలో వారి వ్యక్తిగత పనులను క్రియ పండుగ రోజులకు ఎడా, పెడా పేర్చుకుని విదేశీ వలంటీరులనే నిర్వాహకులు వస్తారు. వీరి విద్యార్హత కనీసం ఇంజినీరింగు... డాక్టర్లు, ఏసీటీవోలు, పారిశ్రామికవేత్తలు, బోలెడంతమంది టీచర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు ఎందరో..... ఇదొక మహా క్రతువులాగా చేసేసి వెళ్లిపోతారు.

క్రియ రోజులు, ముందు వెనుక రోజులు కాకినాడకు ముందుగా తీసుకోకపోతే రైలు టికెట్లుండవు.

**వాలంటీర్లు:** జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అనేక ఇతర స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఇంకా ఎందరో దొరికిన పని, దొరికిన సర్వీసు చేసేస్తుంటారు.

ఇక్కడ ఎవర్ని కదిలించినా భవిష్యత్ తరాలను మెరుగులు దిద్దుకునే శిల్పులలాగా తిరుగుతుంటారు.

**పాల్గొనేవారు:** బడులలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకుంటూ క్రియ పోటీలకు ఎదురుచూసి పాల్గొనే

ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు. ఆసక్తి గల సంగీత, నృత్య పాఠశాలలు, ఆసక్తి గల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకొచ్చే విద్యార్థులు.

**నిర్వాహకులు:** వీరంతా నాలుగో సింహాలే. వీలయితే కనపడరు. పని రాక్షసులు. ఆఖర్న గ్రూప్ ఫొటోలో అక్కడక్కడా కలగా బులగంగా ఉంటారు.

ప్రభుత్వాలు గాని, వేరే ఎవరయినా గాని ఈ కార్యక్రమం చెయ్యాలంటే పొదుపుగా చేస్తే ఖచ్చితంగా ఈ ఖర్చుకు 3 రెట్లవుద్ది. క్రియ లక్ష్యం స్పష్టపడినవారు పొందిన స్ఫూర్తి ఈ కార్యక్రమ విజయానికి ఇంధనం, చోదక శక్తి.

వ్యక్తిగత ప్రతిఫలం ఆశించని ఇంతటి వలంటీరింగ్ మరే చోటా చూడం. పిల్లలను జాతి సంపదగా మార్చే ఈ క్రతువు నిరంతరాయంగా కొనసాగాలని ఆశిస్తూ .........

❖

# మానవాళికి శాశ్వత లక్ష్యాన్ని ప్రతిపాదించిన గాంధీ



## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-


ప్రపంచ చరిత్రలో అతి ముఖ్యమైన వ్యక్తుల్లో గాంధీ ఒకరని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారకనిధి న్యూఢిల్లీ డైమండ్ జూబ్లీ సంఘం నేతృత్వంలో ఏర్పాటు చేసిన బాపూజీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహాత్ముడు మానవ సమాజానికి కావాల్సిన విలువైన, శాశ్వతమైన సందేశం ఇచ్చారని జేపీ అన్నారు. విభిన్న ప్రయోజనాల మధ్య సమన్వయం సాధిస్తూ అందరినీ ఒకే తాటి మీదకు తీసుకొచ్చిన ఘనత గాంధీజీకి దక్కుతుందన్నారు. మనిషికి, ప్రకృతికి మధ్య సమతుల్యం ఉండాలని గుర్తించిన తొలి పర్యావరణవేత్త గాంధీయేనన్నారు. అదే విధంగా ఆనాటి రోజుల్లో టెలిగ్రాఫ్, రైల్వేలు, పత్రికలను వినియోగించుకోవాలని గాంధీజీ కోరేవారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఆయన లోతుగా అర్థం చేసుకున్నారని, చిట్టచివరి మనిషికి కూడా సాధికారత లభించేందుకు గాంధీ ప్రతిపాదించిన అధికార వికేంద్రీకరణను హేతుబద్ధంగా అమలు చేయటం దేశానికి తక్షణావసరమన్నారు. మానవ చరిత్రలో ఎన్నడూ లేని అద్భుత యుగంలో నేటి యువత ఉన్నారని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని, వ్యక్తిగత జీవితాన్ని, సమాజహితాన్ని అనుసంధానిస్తూ ఎద గాలని జేపీ విజ్ఞప్తి చేశారు. సంఘం కార్యదర్శి వై.రామచంద్రరావు మాట్లాడుతూ, దక్షిణాఫ్రికాలో సమానత్వం కోసం గాంధీజీ చేసిన పోరాటం అమోఘమన్నారు. మహాత్ముడి మార్గం అందరికీ అనుసరణీయమని సంఘం తొలి అధ్యక్షుడు డాక్టర్ గాంధీ పీసీ కాజ అన్నారు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సీఎంఎస్) చైర్మన్ నాగులపల్లి భాస్కరరావు రచించిన 'నాయకులు ఎట్లా అవుతారో' అన్న పుస్తకాన్ని జేపీ ఆవిష్కరించారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీ బాబు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్‌బాబు, అకాడమీ కార్యదర్శి డి.శంకరరావు, డాక్టర్ రావి శారద పాల్గొన్నారు.





**హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీలో రెండు వర్క్‌షాప్ లు జరిగాయి. మొదటి మూడు రోజుల వర్క్ షాప్ లో "మహిళా మైత్రి గ్రామాలుగా" తయారు చేయడానికి గ్రామపంచాయతీలలో మహిళా సాధికారత పెంచడానికి అవసరమైన శిక్షణ ఇచ్చారు. దానికి రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్‌గా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నుండి బందారు రామ్మోహనరావు హాజరయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా సమన్వయకర్త జంపాల అంజయ్య పాల్గొన్నారు. ఈ శిక్షణలో తెలంగాణ రాష్ట్రం నుండి ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పదిమందితో పాటు చత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్ ,ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుండి సుమారు 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ లలో "సామాజిక న్యాయం, సామాజిక భద్రత" అనే అంశం లో మరొక మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుండి వివిధ సంఘాల ప్రతినిధులు సుమారు 25 మంది హాజరయ్యారు.**

# గాంధీ - గణతంత్ర భారతం



భారత 75వ గణతంత్ర సంవత్సరంలోకి అడుగుపెట్టాం. వలస పాలకుల నుంచి సాధించుకున్న స్వాతంత్ర్యం లక్ష్యమైన సాధికారతను ప్రజలు హక్కుగా, నిబద్ధతతో సాధించుకునేందుకు రిపబ్లిక్‌గా మారాం. రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చుకున్నాం. బాబాసాహెబ్ అంబేద్కర్ నేతృత్వంలో ఒక అద్భుతమైన, ఉదాత్తమైన రాజ్యాంగం మనకు రూపొందింది. స్వాతంత్ర్యోద్యమం, జాతి నిర్మాణం, దేశ మౌలిక లక్ష్యాల చిరస్మరణీయుడైన గాంధీజీ గురించి రాజ్యాంగం, రాజ్యాంగబద్ధ పాలనాంశాల్లో చర్చ పెద్దగా ఉండదు గానీ, ఒక కీలక వైఫల్యం కారణంగా రిపబ్లిక్ 75 సంవత్సరాల సమీక్ష సందర్భంలో ఆయన పాత్రను విస్తృతంగా ప్రస్తావించాల్సి వస్తోంది. గాంధీ ప్రతిపాదించిన ఓ అంశం వివిధ కారణాల వల్ల రాజ్యాంగంలో చోటుచేసుకోకపోవటం, రిపబ్లిక్ లక్ష్యాలు నెరవేరటంలో అదే పెద్ద అవరోధం కావటం వల్ల ఆ వైఫల్యం చోటుచేసుకుంది. భారత రిపబ్లిక్‌ను విభిన్న లిటిల్ రిపబ్లిక్‌ల సమాహారంగా నిర్మించే స్థానిక స్వపరిపాలనను విస్మరించటం వల్ల స్వతంత్ర భారతదేశం భారీ మూల్యం చెల్లిస్తోంది.

గ్రామస్వరాజ్యం, స్థానిక స్థాయికి అధికారాన్ని వికేంద్రీకరించటం.. ఈ విషయంలో జాతీయోద్యమంలోకి ప్రవేశించిన తొలినాళ్ల నుంచి మహాత్మాగాంధీకి స్పష్టత ఉంది. స్వరాజ్యం అంటే, తెల్లవాళ్లు పోయి నల్లవాళ్లు గద్దెనెక్కటం కాదు, ఈ దేశంలో చిట్టచివరి పౌరునికి కూడా తన జీవితం మీద తనకు సాధికారత ఉండేలా చేయటమని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు. ప్రజాజీవితంలో ఏదైనా ఒక పని చేయాలా, వద్దా అనే సందేహం వస్తే గీటురాయి కూడా అదేనని తరచూ చెప్పేవారు. స్వావలంబన, బాధ్యతాయుత ప్రవర్తన లేకుంటే స్వతంత్రం వచ్చినా ఉపయోగం ఉండదని ప్రజలకు చెబుతుండేవారు, ఒక్కోసారి మందలించేవారు కూడా. ప్రజల సాధికారతలో స్థానిక స్వపరిపాలన ప్రాధాన్యతను ఆయన విస్పష్టంగా గుర్తించారు. గాంధీజీ మాట ప్రజలు, నాయకులకు శిరోధార్యమైనా, ఆయన అనుచరులే పాలకులైనా.. ప్రజలు కేంద్రంగా పాలన, ప్రజల సాధికారత అనే అంశాల్ని స్వాతంత్ర్యానికి, మనం ఎంచుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థకి మౌలికాంశాలుగా గుర్తించలేదు. దీంతో ఆయన ప్రతిపాదించిన స్థానిక స్వపరిపాలన ఇప్పటికీ ఆచరణరూపం దాల్చలేదు.

గ్రామస్థాయి వరకు అధికార వికేంద్రీకరణకు నాడు రాజ్యాంగ సభలో వ్యక్తమైన అభ్యంతరాలు సహేతుకమైనవనటంలో సందేహం లేదు. కులవ్యవస్థ ఘనీభవించిన గ్రామాల పాలనలో స్వయంప్రతిపత్తి ఇస్తే అగ్రకులాల పెత్తనం పెరిగి అణగారిన వర్గాల బతుకు ఇంకా దుర్భరమవుతుందని అంబేద్కర్ ఆందోళన చెందారు. ఇది పూర్తిగా సరైన వాదన. దీంతోపాటు అప్పటి దేశ విభజన పరిస్థితులు కూడా కేంద్రీకృత పాలన వైపు మొగ్గు

చూపేలా చేశాయి. అయితే ఈ భావాల సంఘర్షణలో ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన అధికార వికేంద్రీకరణ మూల్యం చెల్లించింది. చివరికి స్థానిక స్వరాజ్యం అంశాన్ని ఆదేశిక సూత్రాలకు పరిమితం చేశారు.

మన దేశ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కోరుకోలేదు. గాంధీ గారు, ఇతర జాతీయోద్యమ నేతలు చెప్పారు కాబట్టి ప్రజాస్వామ్యానికి తలూపారు. కానీ అధికారం తమ కంటి ముందు, ఇంటి ముందు లేకపోవటం వల్ల, అందులో తమ భాగస్వామ్యం లేకపోవటం వల్ల ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటు అంటే ఏమిటో అర్థంకాని పరిస్థితి వారికి ఏర్పడింది. చివరికి ప్రజాస్వామ్య మూల సూత్రం, జాతీయోద్యమం ద్వారా గాంధీజీ, ఆయన సహచరులు, రాజ్యాంగం ద్వారా అంబేద్కర్, ఇతర నేతలు ఆశించిన లక్ష్యం ఏదైతే ఉందో ఆ ప్రజల సాధికారత భారీ మూల్యం చెల్లించింది. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు, ఎన్నికలంటే ఎలాగోలా అధికారం అనే స్థాయికి చివరికి మన రాజకీయం, సమాజం చేరుకున్నాయి. మిగతా పలు రంగాల్లో భారతదేశం గణనీయ పురోగతి సాధిస్తున్నా, పోలింగ్ బూత్‌లో ఎన్నికల్ని సక్రమంగా నిర్వహిస్తూ మన ఎన్నికల కమిషన్ ప్రపంచంలోనే గుర్తింపు పొందినా, మన ఎన్నికల రాజకీయం ఉన్నకొద్దీ దిగజారుతూ కోట్లాది రూపాయల నల్లడబ్బు లేనిదే ఎన్నికల్లో పోటీ అసాధ్యమనే పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల ఎన్నికల్లో గెలిచేవారు సరైన పాలన చేయలేకపోతున్నారు, సమర్థ పాలన అందించగలిగేవారు ఎన్నికల్లో గెలవలేకపోతున్నారు. సమర్థులు, నిజాయతీపరులు రాజకీయాలకి దూరమవుతూ నేరస్తులు, అసమర్థులు ఉన్నకొద్దీ పెరుగుతూ, మన దేశం సాధించాల్సిన స్థాయి ప్రగతి సాధించలేకపోతోంది.

అందుకే స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద వైఫల్యం ఏమిటి అనే ప్రశ్నకు, స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటమని చెప్పటానికి సందేహించనక్కర్లేదు. గాంధీజీ చెప్పిన గ్రామ స్వరాజ్య భావన యధాతథంగా అమలు సాధ్యం కాకపోవచ్చు. గ్రామ స్థాయి వరకు అధికార వికేంద్రీకరణ, కుల వ్యవస్థ అణచివేత నిర్మూలన.. ఈ రెంటి మధ్యా సమన్వయం సాధించకుండా స్థానిక ప్రభుత్వాల సాధికారతను ఆదేశిక సూత్రాల్లో పెట్టి వాయిదా వేయటం వల్ల మన ప్రజాస్వామ్య పరిణతి తరతరాలుగా వాయిదా పడుతూ వస్తోంది.

రాజ్యాంగబద్ధ ఏర్పాటులేకున్నా స్వాతంత్ర్యం వచ్చాక కూడా కొన్నేళ్లపాటు స్థానిక ప్రభుత్వాలు బలంగానే నడిచాయి. ఇందుకు మూలాలు మన సంస్కృతి, జాతీయోద్యమ ప్రభావంలో ఉన్నాయి. మన దేశంలో తరతరాలుగా గ్రామీణ స్థాయిలో కొంత బలమైన స్థానిక పాలన ఉండేది. రాచరిక కాలంలో కూడా గ్రామ పాలనలో చక్రవర్తులు పెద్దగా జోక్యం చేసుకునేవారు కాదు. ఆ ఒరవడితోపాటు జాతీయోద్యమంలో ఊరూరా పెరిగిన నాయకత్వం, సమష్టి తత్వం స్థానిక ప్రభుత్వాలలో ఉమ్మడి అవసరాలు మెరుగ్గా జరగటానికి దోహదం చేసింది. దీనివల్ల స్వతంత్రం వచ్చిన తొలి దశాబ్దాల్లో స్థానిక ప్రభుత్వాలు విద్య, మౌలిక వసతులు వంటి కొన్ని కీలక రంగాల్లో గొప్ప సేవల్ని అందించాయి. ఎటువంటి వసతులూ లేకున్నా అక్కడి స్కూళ్లలో తెలుగు మీడియంలో చదువుకున్న లక్షలమంది దేశంలో, ప్రపంచంలో గొప్ప స్థాయికి ఎదిగి పలు రంగాల్లో సంపద సృష్టించారు, దిశానిర్దేశం చేస్తున్నారు. రాజకీయంలో స్థానిక ప్రభుత్వాల నుంచి నేతలుగా ఎదిగినవారు ముఖ్యమంత్రులు, జాతీయ స్థాయి మంత్రులు అయ్యారు. తెలుగునాట ఎంతో సమర్థుడైన ముఖ్యమంత్రిగా పేరుగాంచిన జలగం వెంగళరావు స్థానిక ప్రభుత్వ స్థాయి నుంచే అంచెలంచెలుగా ఎదిగారు. కానీ ఎప్పుడైతే జాతీయోద్యమ స్ఫూర్తి, గాంధేయవాద ఆదర్శాలు పలచబడ్డాయో, ఎమర్జెన్సీ నాటి నుంచి కేంద్రీకృత పాలన ఇంకా తీవ్రమైందో స్థానిక ప్రభుత్వాలు పూర్తిగా నీరసించిపోయాయి.

**దూరంగా ఉన్న దుష్పరిపాలనను ఎలా ఎదుర్కోవాలో తెలియని నిస్సహాయ స్థితి**

1980ల తర్వాత ఎన్.టి రామారావు, కరుణానిధి, బిజూ పట్నాయక్, రామకృష్ణ హెగ్డే వంటి నేతల కృషితో దేశంలో ఫెడరలిజం బలపడినా, ఆ వికేంద్రీకరణ ఫలాలు రాష్ట్ర స్థాయికే పరిమితమయ్యాయి. అధికార కేంద్రీకరణలో ప్రధానమంత్రి కంటే ముఖ్యమంత్రులు ఒక ఆకు ఎక్కువే చదవటం మొదలుపెట్టారు. దీంతో దేశంలో దుష్పరిపాలన అనివార్యంగా కొనసాగుతోంది. దూరంగా ఉన్న సుపరిపాలన కన్నా మనకు స్వపరిపాలనే మిన్న అని మన జాతీయోద్యమ నాయకులు బ్రిటిష్ వారి మీద పోరాడారు. కానీ స్వతంత్రం వచ్చి 76 ఏళ్లు గడిచాక దూరంగా రాజధానులు కేంద్రంగా దుష్పరిపాలన సాగుతోంది, స్థానిక స్వపరిపాలన లేకుండా పోయింది, రోజువారీ జీవితంలో మంచినీరు, మురుగునీటి పారుదల, రవాణా, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు, శాంతి భద్రతలు వంటివి కూడా మనలో చాలామందికి దుర్భరంగా మారాయి. శాస్త్ర సాంకేతిక రంగాలు, మన సమాజంలోని అంతర్గత బలాలు, ఆర్థిక రంగంలో కొంత స్వేచ్ఛ, విధిలేని పరిస్థితుల్లోనో, యధాలాపంగానే పాలకులు చేసిన కొన్ని మంచి పనుల వల్ల మనం గతం కంటే మెరుగ్గా ఎదగగలిగాం తప్ప మన ప్రభుత్వాలు సుపరిపాలన అందిస్తుండటం వల్ల కాదు.

దూరంగా ఉన్న దుష్పరిపాలనను ఎలా ఎదుర్కోవాలో తెలియని మన నిస్సహాయ స్థితికి మూల కారణం స్థానిక పాలనకు బలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోకపోవటంలో ఉంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో అంతకుముందు జరిగిన కొన్ని తప్పుల్ని సరిచేసే క్రమంలో బలమైన స్థానిక ప్రభుత్వాల ఆవశ్యకతను గుర్తించారు. స్థానిక సాధికారత కోసం 1987లో రాజ్యాంగ సవరణ తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే అది వివిధ రాజకీయ కారణాల వల్ల రాజ్యసభలో వీగిపోయింది. ఆ తర్వాత పీవీ నరసింహారావు ప్రభుత్వం పంచాయతీలను పటిష్టం చేయటం కోసం 73వ రాజ్యాంగ సవరణను ప్రవేశపెట్టింది. మైనారిటీ ప్రభుత్వం అయినా అన్ని పార్టీలనూ పీవీ ఒప్పించారు. దీంతో 1992లో ఆ సవరణ పార్లమెంటు ఆమోదం పొందింది.

1993 ఏప్రిల్‌లో అమల్లోకి తెచ్చారు. అదే ఏడాది పట్టణ స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది. ఆ రెండు రాజ్యాంగ సవరణలూ వచ్చి 30 ఏళ్లు పూర్తయ్యాయి. కానీ సాధించింది మాత్రం శూన్యం. సవరణలు రాకముందు స్థానిక ప్రభుత్వాల నుంచి 28 మంది ముఖ్యమంత్రులు, మంత్రులు రాగా, అవి అమలయ్యాక కేవలం ఒక్కరే మూడో అంచె నుంచి ఎదిగి ముఖ్యమంత్రి కాగలిగారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఆ ఎక్స్‌క్లూజివ్ ఉదాహరణ.


లోపం ప్రధానంగా 73, 74 రాజ్యాంగ సవరణల రూపకల్పన సమయంలోనే జరిగింది. ఏడు వేలకు పైగా పదాలతో వాటిని తయారుచేశారు. ఇంత వైవిధ్యం ఉన్న దేశంలో స్థానిక ప్రభుత్వాలు ఎలా ఉండాలో రాజ్యాంగంలోనే వర్ణించి చెప్పారు. ఇంతా చేసి అధికారాలు, నిధుల్ని మాత్రం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యానికి వదిలేశారు.

కచ్చితంగా స్థానిక ప్రభుత్వాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా పనిచేయలేవు. కానీ రాష్ట్ర స్థాయి ప్రభుత్వం పాత్ర కేవలం పర్యవేక్షణ, జవాబుదారీతనానికి పరిమితం కావాలి. ముఖ్యమంత్రుల చుట్టూ అధికార కేంద్రీకరణ జరుగుతూ, ఎన్నికల్లో డబ్బు ప్రభావం పెరుగుతూ రాజకీయానికి రాష్ట్రం యూనిట్‌గా మారుతున్న తరుణంలో స్థానిక ప్రభుత్వాల ఉనికి, రోజువారీ పని కూడా రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో జరిగే ఏర్పాటు వల్ల 73, 74 రాజ్యాంగ సవరణలు ఆచరణలో విఫలమయ్యాయి.

నిధులు, అధికారాలు లేని స్థానిక ప్రభుత్వాల వల్ల గ్రామ ప్రాంతాలు మరీ అధ్వాన్నమైపోగా, పట్టణ ప్రాంతాలు ప్రజల జీవితాల్ని దుర్భరంగా మార్చాయి. పొట్ట చేత పట్టుకుని పట్టణాలకు వలస వెళ్లినవారు మరింత కష్టనష్టాల జీవితాల్ని గడపాల్సిన పరిస్థితి. అవినీతి పెరిగిపోయింది.

**పదేళ్లలోనే అర్థమైంది**

నిజానికి 73, 74 రాజ్యాంగ సవరణలు విఫలమయ్యాయన్న విషయం అవి అమల్లోకొచ్చిన అయిదు, పదేళ్లలోనే అర్థమైంది. ఈ విషయాన్ని అప్పట్లో జరిగిన జాతీయ స్థాయి పంచాయతీరాజ్ సదస్సులో ప్రధానమంత్రి వాజ్‌పేయి, ప్రతిపక్ష నేత సోనియా గాంధీ కూడా అంగీకరించారు. అవసరమైతే రాజ్యాంగ సవరణ కూడా చేసి సాధికారత కల్పిస్తామన్నారు. కానీ వాజ్‌పేయి హయాంలో జరగలేదు. ఆ తర్వాత అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ప్రభుత్వం కూడా ఈ అంశాన్ని పట్టించుకోలేదు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ఉండటం భారతదేశ అభివృద్ధికి ఎంత అవసరమో ఒక అధికారిగా అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లి గట్టిగా వాదించి 73, 74 రాజ్యాంగ సవరణలు రావటానికి దోహదం చేసిన ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఆ రాజ్యాంగ సవరణల్లోని లోపాల్ని




వివరిస్తూ గట్టి ప్రయత్నం చేసినా రాజీవ్‌గాంధీ సహాధ్యాయి అయిన ఒక బ్యూరోక్రాట్ రాజకీయవేత్త మూర్ఖంగా అడ్డుకుని దేశ ప్రయోజనాలకి తీవ్ర నష్టం చేశారు.

**బ్యూరోక్రసీకి తోడైన ఎమ్మెల్యేలు**

వలస పాలన కాలం నాటి ధోరణుల్నే కొనసాగిస్తూ ప్రజల్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడటానికి అలవాటుపడిన ప్రభుత్వ యంత్రాంగంలో అత్యధికులకు అధికార వికేంద్రీకరణ అంటే అసలు సరిపడదు కాబట్టి, వారు కూడా స్థానిక ప్రభుత్వాలు బలపడకుండా వీలైనంత గండికొడుతూ వస్తున్నారు. కాలక్రమంలో ఎన్నికల రాజకీయం దిగజారి, ఎమ్మెల్యేల మద్దతు కోసం ముఖ్యమంత్రి వారిని నియోజకవర్గంలో మకుటం లేని మహారాజుల్లా వ్యవహరించేందుకు లైసెన్స్ ఇవ్వటంతో, కాంట్రాక్టులు, పోస్టింగులు వంటి వాటి ద్వారా అక్రమార్జన చేయటంతోపాటు, స్థానిక ప్రభుత్వాలను ఎమ్మెల్యేలు ఇంకా అణగదొక్కారు.

బ్యూరోక్రసీ-రాజకీయ నేతల మధ్య బంధం మరింత బలపడి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రాబల్యం పెరిగి, రాష్ట్రంలో ముఖ్యమంత్రి, జాతీయ స్థాయిలో ప్రధానమంత్రి కనుసన్నల్లో కేంద్రీకృత పాలన పరాకాష్టకు చేరిన ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రతిపక్షం ఏం చెప్పినా అధికార పక్షం, అధికార పక్షం ఏం చెప్పినా ప్రతిపక్షం విచక్షణారహితంగా వ్యతిరేకిస్తున్న వాతావరణంలో, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతకు వారు 73, 74 రాజ్యాంగ సవరణల్ని సరిదిద్దుతారని ఆశించటం అత్యాశే అవుతుంది. కానీ స్థానిక ప్రభుత్వాల సాధికారతకు ఏర్పాట్లు జరగకుండా భారతదేశానికి పరిష్కారం సాధ్యమవదు.

ఈ నేపథ్యంలో ఒక అవకాశం, జాతీయ స్థాయి నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధుల్లో స్థానిక ప్రభుత్వాలకు నేరుగా నిధుల్ని కేటాయించే ఏర్పాటు చేయటం. ఇందుకు కూడా లోక్‌సత్తా కృషితో 14 ఆర్థిక సంఘం నుంచి ఒక ఒరవడి ఏర్పడింది. అప్పటిదాకా ఉన్న కేటాయింపులకి మూడు రెట్లు దాకా ఎక్కువ నిధుల్ని కేటాయించారు. అయితే ఈ నిధుల్ని కూడా రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేసుకుంటూ స్థానిక సాధికారతకు గండి కొడుతున్నాయి.

అధికారం పట్ల ఉన్మాదం అనే స్థాయి ఆరాధనాభావం ఉన్న మన దేశంలో స్థానిక ప్రభుత్వాల్లో పదవులకు కూడా విపరీత పోటీ ఉంటుంది గానీ.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల



ప్రమేయం అవసరం లేకుండా స్థానిక ప్రభుత్వాలకు అధికారమంటే, కాస్త చదువుకున్నవాళ్లు, మధ్యతరగతికి కూడా నచ్చదు. అంచేత ఇది పబ్లిక్ డిమాండ్ కూడా కాదు. స్థానిక ప్రభుత్వాల పట్ల సమాజంలో ఎంత చులకనభావం ఉందంటే, స్థానిక ఎన్నికల్లో మహిళలు, అణగారిన వర్గాలకు 50 శాతం దాకా రిజర్వేషన్లు ఉన్నా, వారికి ఎందుకు అధికారాలు లేవన్న ప్రశ్న అణగారిన వర్గాలు, మహిళల నాయకులమని చెప్పుకునేవారి నుంచి కూడా పెద్దగా వినిపించటం లేదు. స్థానిక ప్రభుత్వాలు సక్రమంగా లేకున్నా తమ పనుల్ని చాలామేర సొంత వనరులతో చక్కబెట్టుకుంటారు కాబట్టి సంపన్నులు పెద్దగా పట్టించుకోరు. కానీ ప్రజాస్వామ్య పాఠశాలలైన స్థానిక ప్రభుత్వాలు సక్రమంగా లేకుండా పైన ఎన్ని అంతస్తులు కట్టినా అవి నిలబడవు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి దేశంలో మన ఇంటి చుట్టూ మురుగునీటి పారుదలను, రోడ్లను, వీధి దీపాలను, మౌలిక సదుపాయాలను, పాఠశాల విద్య, ప్రాథమిక వైద్యం వంటివి సవ్యంగా అందించలేరు. రోజువారీ జీవితంలో దాదాపు 80 శాతం సేవలు స్థానికంగానే ఉంటాయి. స్థానిక సాధికారత లేకపోవటం వల్ల మన నగర జీవనం ఎంత దుర్భరంగా ఉందో ప్రతి కాలంలోనూ చూస్తున్నాం. ఎండలు, వానలు ఎక్కువైనా, తక్కువైనా గగ్గోలే. మన దేశంలో కంటే నియంతృత్వ దేశం చైనాలో, మత ఛాందస దేశం పాకిస్తాన్‌లో కూడా స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉన్నాయి. ప్రజాస్వామ్య పరిణతి గల జర్మనీ వంటి దేశాల్లో శాంతి భద్రతలు, పాస్‌పోర్ట్ వంటి సేవలు కూడా మునిసిపల్ కార్యాలయాల్లో అందుతాయి.

**మార్పుకి సంవత్సరాలు, దశాబ్దాలు తీసుకునే జడత్వం**

అవిద్య, పేదరికం విస్తారంగా ఉన్న దేశంలో ప్రజలు అడగకుండానే ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టి, అందరికీ ఓటు హక్కును తొలిరోజు నుంచీ అందించాం. కానీ ప్రజలకు ఆ ఓటు విలువ అర్థమయ్యే వ్యవస్థను స్థానికంగా నిర్మించకుండా ఎక్కడ ఏం జరుగుతుందో అర్థంకాని ఒక విపరీత కేంద్రీకృత వ్యవస్థను నిర్మించాం. ఒక మంచి మార్పును తీసుకురావటానికి దశాబ్దాలు, ఆ మంచిమార్పు మరో మెట్టు ఎక్కటానికి మరికొన్ని దశాబ్దాలు.. ఆ తరహా జడత్వాన్ని మన రాజకీయ, సామాజిక ఆలోచనాతీరులో కొనసాగిస్తుండటం వల్ల రాష్ట్ర స్థాయి ఫెడరలిజం స్థానిక స్థాయి ఫెడరలిజంగా రూపుదిద్దుకోలేదు. ప్రజాస్వామ్యానికి మౌలికావసరమైన నిరంతర అప్రమత్తతకు, నిరంతర మెరుగుదలకు శత్రువైన ఆ రకమైన జడత్వం వల్ల ఇప్పటికీ మనం స్వతంత్రం వచ్చినప్పుడు జరిగిన వ్యవస్థీకృత తప్పుల్ని సరిదిద్దుకోలేకపోతున్నాం., పౌరసత్వాన్ని పెంపొందించుకోలేకపోతున్నాం. ఈ నేపథ్యంలో ఈవేళ స్థానిక ప్రభుత్వాలను బలపేతం చేసినా తక్షణం మార్పు వచ్చేస్తుందని, ప్రజలు వెంటనే ఎన్నికల్లో డబ్బు తీసుకోకుండా, తాయిలాలు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా, కులం, మతం వంటి ఉన్మాదాలకు లోనుకాకుండా ఓటు వేస్తారని చెప్పలేం. 73, 74 రాజ్యాంగ సవరణలు విఫలమయ్యాయని గుర్తించినప్పుడే 2000 - 2005 ప్రాంతంలోనే దిద్దుబాటు చర్యలు తీసుకుంటే ఈపాటికి పరిస్థితి చక్కబడేది. ఇప్పుడు ఎన్నికల్లో డబ్బు ప్రవాహం చేయి దాటి పోయింది. రాజకీయ పార్టీల్ని, ప్రజల్ని కూడా నిందించలేని పరిస్థితి ఏర్పడింది. ఓటుకు నోటు తీసుకునే ఒక నియోజకవర్గంలోనివాళ్లకి కూడా మన దేశం మొత్తంలోని జైళ్లు సరిపోవు. కాబట్టి ఎన్నికల సంస్కరణలతో పాటు స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధులను బదిలీ చేస్తే, జవాబుదారీతనానికి ఏర్పాట్లు చేస్తే, కొన్నేళ్లలోనైనా మనం ఎన్నికల సంక్షోభం నుంచి బయటపడగలం. నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకోగల అర్హత సాధించగలం. రాజ్యాంగ, సుపరిపాలన లక్ష్యాల్ని సాధించగలం. స్థానిక ప్రభుత్వాలకు యూనియన్ ప్రభుత్వం నుంచి అడహాక్ నిధులు కాకుండా, జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాల తరహాలో ఆదాయంలో తప్పనిసరిగా, కనీసం 33% వాటా ఇచ్చేలా అధికారాల విభజన జరగాలి. నగరాలతో మొదలుపెట్టి గ్రామ స్థాయి వరకు బలమైన స్థానిక ప్రభుత్వాలను నిర్మించాలి. గాంధీజీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్య భావనలోని ఆచరణసాధ్యంకాని అంశాల్ని తొలగించటంతోపాటు అంబేద్కర్ అప్పట్లో లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ప్రత్యామ్నాయంగా.. పంచాయతీగా సాంప్రదాయ గ్రామాన్ని గుర్తించకుండా, ఓ 15-20 గ్రామాలను కలిపి పంచాయతీ యూనిట్‌గా ఏర్పాటు చెయ్యాలి. ఆ క్లస్టర్ విధానం వల్ల పంచాయతీలకు కనీస జనాభా పరంగా, ఆర్థికంగా కూడా సుస్థిరతకు కావలసిన ప్రాతిపదిక ఏర్పడుతుంది. కులం బలహీనపడి ప్రజాస్వామ్యం బలపడుతుంది. అలాగే పట్టణ ప్రాంత స్థానిక ప్రభుత్వాల్లో

ప్రజాప్రతినిధులతోపాటు ప్రజల నుంచి ఎన్నికైన సభ్యులతో వార్డు ప్రభుత్వాల్ని ఏర్పాటు చేయాలి.
స్థానిక ప్రభుత్వాల సాధికారత కేవలం గాంధేయ ఆదర్శం కాదు.. ఈ దేశానికి రోజువారీ అవసరం. ఒక దేశం విజయవంతమవటానికి సాధికార స్థానిక ప్రభుత్వాలు మాత్రమే సరిపోవు కానీ, బలమైన స్థానిక ప్రభుత్వాలు లేకుండా ప్రపంచంలో ఏ దేశంలోనూ ప్రజాస్వామ్యం విజయవంతమైన దాఖలాలు లేవు.
కాబట్టి అధికార వికేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను రిపబ్లిక్ 75వ సంవత్సరంలోనైనా ఎన్నికల ఎజెండాగా మార్చి వేగంగా సాధించటం, మూడంచెల ఫెడరలిజాన్ని భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య మౌలిక లక్షణం గావించటం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న భారతదేశ లక్ష్య సాకారానికి కీలకావసరం. ❖





# ఖర్చులేని మంచి చాలా చేయొచ్చు


భారత గణతంత్రం ఎన్నో గణనీయ విజయాల్ని సాధించినా, అంతరిక్షంలో సైతం పోటీ పడుతున్నా, దేశంలో కోట్లాది మందికి సరైన ఆరోగ్యం, విద్య అందటం లేదని, ఎదిగే అవకాశాలు సమానంగా అందరికీ అందటం లేదని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. బి.సి సాధికారత సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన 75వ గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
సంస్థ ఇంచార్జి ఇంద్రవెల్లి రమేష్ అధ్యక్షత వహించారు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం పెద్ద డబ్బు ఖర్చు లేకుండానే అందించవచ్చని, ఈ దిశగా తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని, అధికారులు గురుకుల పాఠశాలల తరహాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్నీ బాగుచేయాలని శ్రీనివాసు కోరారు.
సమాచార చట్టం సక్రమంగా అమలు చేయటానికి, సిటిజన్స్ చార్టర్ల అమలుకి కూడా ఎక్కువ ఖర్చేమీ అవదని, కానీ ఫలితాలు మాత్రం ఘనంగా ఉంటాయన్నారు. అధికార కేంద్రీకరణ వల్ల దీర్ఘకాలంలో పార్టీలకు కూడా నష్టమని, అందువల్ల స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో వీరేశం, శంకర్, దుర్గారావు, నరహరి, రమేష్, నర్సింహులు, రవి ముదిరాజ్ పాల్గొన్నారు.

# ఓటర్ బి అవేర్ – సేవ్ డెమోక్రసీ

ఎన్నికల్లో డబ్బు ప్రవాహం, కులం, కుటుంబ రాజకీయాలు, చట్టసభల్లో బూతులు తిట్టుకోవటం మన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'ఓటర్ బి అవేర్ – సేవ్ డెమోక్రసీ' కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేనివారు రాజకీయాల్ని శాసిస్తున్నారని, అవగాహనలేనివారిని పదుల సంఖ్యలో సలహాదారులుగా నియమించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, రాజకీయాల్లో నాయకులుగా ఎదగాలనుకునేవారికి కూడా అర్హత పరీక్ష, శిక్షణ అవసరమన్నారు. కార్యక్రమంలో సోషల్ యాక్టివిస్ట్ తుమరాడ గంగాధర్, స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ సెక్రటరీ సిరిపురపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బలమైన స్థానిక పాలనతోనే దేశాభివృద్ధి

- స్థానిక ప్రభుత్వాలకు అధికారాల బదలాయింపు ముఖ్యం
- కేరళలో పంచాయతీలను ఎమ్మెల్యేలు విస్మరించలేరు



**బలమైన స్థానిక పాలనతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పంచాయతీరాజ్ నిపుణులు, యూనియన్ పంచాయతీరాజ్ శాఖ మాజీ కార్యదర్శి ఎస్.ఎం విజయానంద్ అన్నారు. పంచాయతీలపై విశ్వాసం ఉంచి అధికారాలను అప్పగిస్తే సత్ఫలితాలు ఉంటాయని, కేరళలో పంచాయతీరాజ్ విజయంలో ఇది కీలకమని అన్నారు. రాజకీయ సంకల్పంతోనే బలమైన పంచాయతీరాజ్ వ్యవస్థ రూపుదిద్దుకుంటుందన్నారు. అవినీతిరహితంగా ప్రజల పూర్తి భాగస్వామ్యంతో నడిచేదే అత్యుత్తమ పంచాయతీ అని 'ఈనాడు'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.**

(?) దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ఎలా నడుస్తోంది

విజయానంద్: పంచాయతీరాజ్ విధానం అమల్లో అగ్రస్థానంలో ఉన్న కేరళలో కూడా ఇంకా చేయాల్సింది చాలా ఉంది. కేరళలో స్థానిక సంస్థల కోసం కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.1800 కోట్లు వస్తుంటే రాష్ట్రం రూ.13 వేల కోట్ల నుంచి రూ.14 వేల కోట్లు ఇస్తోంది (ఇటీవల ఈ మొత్తం పెరిగింది). ఇంత మొత్తంలోనే అన్ని రాష్ట్రాలూ ఇవ్వాలని నేను అనడం లేదు. కనీసం కేంద్ర ఆర్థిక సంఘం నిధులతో సమానంగానైనా ఇవ్వాలి. ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా పంచాయతీల ద్వారా అమలు చేయాలి.

(?) కేరళలో విజయం కేవలం నిధుల వల్లే సాధ్యమైందా

అక్కడి విధానం రాజకీయాలకు అతీతంగా సాగింది. ప్రభుత్వాలు మారినా పంచాయతీరాజ్ విధానం మారలేదు. అన్ని రాజకీయ పార్టీల వారు వ్యవస్థ బలోపేతానికి కృషి చేశారు.

> **చట్టాలు చేయటమే శాసన సభ్యుల కీలక బాధ్యత. గ్రామ పంచాయతీల ద్వారా అభివృద్ధి జరగాలి. కేరళలో పంచాయతీలు, శాసన సభ్యుల మధ్య విభజన స్పష్టంగా ఉంది.**

భిన్నాభిప్రాయాలు ఉన్నా ఒకే విధానంతో ముందుకు వెళ్లారు. అధికారం, ప్రతిపక్షం, స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక సంస్థలు ఇలా అన్నీ భాగం అయ్యాయి. ఎన్నో అధికారాలను బదలాయించారు. వికేంద్రీకరణపై ఎస్పీ సేన్ కమిటీ కీలకంగా వ్యవహరించింది. ప్రజల మద్దతు, రాజకీయ సంకల్పం అక్కడి విజయంలో కీలకం.

(?) పంచాయతీలకు రాబడులు తక్కువగా ఉంటున్నాయి కదా

దక్షిణాది రాష్ట్రాల్లో పంచాయతీలకు 2015కు ముందు రాబడులు తక్కువగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. మధ్యభారతదేశంలో పన్నులు వసూలు చేయటం లేదు. అలా వసూలు చేయకుంటే ప్రజలు ప్రశ్నించలేరు. జవాబుదారీతనం కూడా రాదు. వినియోగ ఛార్జీల ద్వారా రాబడులు పెంచుకునే అవకాశం ఉంది. వీటిపై దృష్టి సారించటం లేదు.

(?) పంచాయతీలు చిన్నవిగా ఉండాలా, పెద్దవి మంచిదా

చిన్న పంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో సేవలు కూడా చాలా ముఖ్యం. చిన్న పంచాయతీలకు నిధుల సమస్య తీవ్రంగా ఉంటుంది. ఆర్థికపరమైన తోడ్పాటు లేకుంటే అభివృద్ధి సాధ్యం కాదు. కనీసం పదివేల జనాభాతో పంచాయతీలు ఉంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

(?) పట్టణీకరణ చూపుతున్న ప్రభావం ఏమిటి

పట్టణీకరణ ప్రభావం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోనే పట్టణ సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసేలా పుర, రూర్బన్ పథకాలు కేంద్రం తీసుకువచ్చినా ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ సౌకర్యాలు కల్పించాలి.

> **ప్రజల ఆలోచనలు వినాలి .. ప్రజలకు అన్నీ చెప్పాలి**
>
> **ఉత్తమ పంచాయతీ అంటే అవినీతి రహితంగా ఉండాలి. ప్రజల భాగస్వామ్యం ఉండాలి. ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రతి నిధులకు పూర్తి అజమాయిషీ ఉండాలి. ప్రజాప్రతినిధులు, అధి కారులు కలసికట్టుగా పనిచేసి ప్రజల సమస్యలకు పరి ష్కారం చూపాలి. ప్రజల ఆలోచనలు వినాలి.. ప్రజలకు అన్నీ చెప్పాలి.**

గ్రామాల్లో అవసరమైన సౌకర్యాలు ఉంటే పట్టణాలకు వాటి కోసం వెళ్లే అవసరం ఉండదు.

(?) పంచాయతీరాజ్ వ్యవస్థ ఉజ్వల భవిష్యత్తుకు మీ సూచనలు ఏమిటి

దేశం అభివృద్ధి చెందాలంటే బలమైన స్థానిక పాలన ఉండాలి. గ్రామ పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా భావించాలి. కమ్యూనిస్టు దేశమైన చైనాలో కూడా బలమైన స్థానిక వ్యవస్థలు ఉన్నాయి. పాశ్చాత్య దేశాల్లోనూ అంతే. అమెరికా, కెనడా వంటి దేశాలే ఇందుకు నిదర్శనం. మన దేశంలో అధికారాల బదలాయింపు కాగితాలపై కాకుండా వాస్తవంగా జరగాలి. ❖

# కేరళలో పంచాయతీల సగటు ఆదాయం రూ.60 లక్షలు..
# తెలంగాణలో రూ.11.52 లక్షలు



తెలంగాణలో గత మూడేళ్లలో పంచాయతీల ఆదాయం పడిపోయిందని రిజర్వు బ్యాంకు తాజా నివేదికలో తెలిపింది. 'పంచాయతీరాజ్ సంస్థ ఆర్థిక పరిస్థితి 2020-23' పేరుతో అన్ని రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీల ఆదాయ, వ్యయాల తీరును విశ్లేషిస్తూ ఈ నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం 2022-23లో గరిష్టంగా కేరళలో పంచాయతీల సగటు ఆదాయం రూ.60.69 లక్షలుంటే, తెలంగాణలో కేవలం రూ. 11.52 లక్షలే. వెనుకబడిన రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్‌లో రూ. 13.53 లక్షలు, బీహార్‌లో 38.94 లక్షలుగా ఉంది. బీహార్‌లో గత మూడేళ్ల వ్యవధిలో సగటు ఆదాయం రూ.8.45 లక్షల నుంచి రూ.38.94 లక్షలకు పెరిగితే ఇదే కాలవ్యవధిలో తెలంగాణలో రూ.20.36 లక్షల నుంచి రూ.11.52 లక్షలకు తగ్గింది. జాతీయ సగటు 2022-23లో రూ. 21.23 లక్షలు.

**తగ్గిన వ్యయాలు**

సొంత ఆదాయ వనరులు లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే గ్రాంట్లపైనే పంచాయతీలు ఆధారపడుతున్నాయని ఆర్‌బీఐ వివరించింది. తెలంగాణలో గ్రామ పంచాయతీల సగటు వ్యయం 2020-23 మధ్యకాలంలో రూ.16.50 లక్షల నుంచి రూ.11 లక్షలకు తగ్గిపోయినట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. పంచాయతీలు నిధులు నిధుల వ్యయంలో పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించింది. ప్రధానంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా పర్యావరణాన్ని పరిరక్షించే వ్యవసాయ పద్ధతులను అమల్లోకి తేవాలని సూచించింది. సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తి, వినియోగం పెరగాలంటే దేశంలో పంచాయతీలదే కీలక పాత్ర అని వివరించింది.

**అధికారాలివ్వని రాష్ట్ర ప్రభుత్వాలు**

గ్రామ పంచాయతీలకు మొత్తం 29 అధికారాలను అప్పగించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. దేశంలో కేరళ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్; హర్యానా, సిక్కిం రాష్ట్రాలు మాత్రమే మొత్తం 29 అధికారాలను గ్రామ పంచాయతీలకు అప్పగించాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు 14 మాత్రమే బదిలీ చేసినట్లు రిజర్వు బ్యాంకు తెలిపింది. తెలంగాణ కన్నా తక్కువగా మణిపూర్ 5, పంజాబ్ 9, ఉత్తరాఖండ్ 11 అధికారాలను బదిలీ చేశాయి. కేరళ వంటి రాష్ట్రాల్లో పంచాయతీలకు భారీగా ఆదాయం రావటానికి పూర్తిస్థాయిలో 29 అధికారాలతో స్థానిక స్వపరిపాలన చేయటం, పారదర్శకంగా ఆదాయ వ్యయాలుండటమే ప్రధాన కారణమని, స్థానిక సంస్థలను బలోపేతం చేయటం దేశాభివృద్ధికి కీలకమని నివేదిక స్పష్టం చేసింది.

**ఉద్యోగాలకు కోటి మంది మహిళల దరఖాస్తు**

గతేడాది ద్వితీయ (టైర్ 2), తృతీయ శ్రేణి (టైర్ 3) నగరాల నుంచి ఉద్యోగాల కోసం మొత్తంగా 3.2 కోట్ల దరఖాస్తులురాగా, అందులో మహిళలవి ఒక కోటి ఉన్నాయని ఓ నివేదిక తెలిపింది. 2022లో వచ్చిన మొత్తం 2.7 కోట్ల దరఖాస్తులలో మహిళల నుంచి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 13 శాతం మేర పెరిగిందన్న మాట. ఉద్యోగాలు, వృత్తి నిపుణుల నెట్‌వర్క్ వెబ్‌సైట్ అప్నా.కో ఈ నివేదిక రూపొందించింది. టైర్ 2, టైర్ 3 నగరాల్లో సగటున నిముషానికి మహిళల నుంచి 100కి పైగా ఉద్యోగ దరఖాస్తులు వస్తున్నాయని, ఉద్యోగాల నియామక ధోరణుల్లో కీలక మార్పును ఇది తీసుకొచ్చే అవకాశం ఉందని నివేదిక తెలిపింది. అంతేకాకుండా వీరిలో 80 శాతం మంది మహిళలు కార్యాలయాలకు వచ్చి ఉద్యోగం చేసే వాటి కోసమే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది. ఇంటి నుంచి పనిచేయటం వల్ల ఉద్యోగ జీవితంలో ఉన్నతికి పరిమిత అవకాశాలు ఉండొచ్చనే భావనతో ఈ తరహా ఉద్యోగాలను తిరస్కరిస్తున్నట్లు తేలిందని పేర్కొంది. 2022, 2023లో తమ ప్లాట్‌ఫాంపై నమోదైన ఉద్యోగ దరఖాస్తులు, నియామక ప్రకటనలపై విశ్లేషణ ఆధారంగా పై నివేదికను అప్నా.కో రూపొందించింది. సేల్స్ సపోర్ట్, ఎంటర్‌ప్రైజ్ సేల్స్, ప్రకటనలు, స్థిరాస్తి, ఇన్‌సైడ్ సేల్స్, బ్రాండ్, మార్కెటింగ్, ఇ-కామర్స్ విభాగాల్లో మేనేజర్ ఉద్యోగ ప్రకటనలు పది రెట్లు పెరిగాయని నివేదిక తెలిపింది. ❖

# అసహనం కాదు..పరిష్కారాలు కనుగొనాలి

## లోక్‌సత్తా రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం

గత ప్రభుత్వం తీరు పట్ల అసహనం వ్యక్తం చేయటమే పనిగా కాకుండా రాష్ట్రం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని, అభివృద్ధిని, సంక్షేమాన్ని సమన్వయపరచాలని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్ ఆబిడ్స్‌లోని పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ హాల్లో ఏర్పాటు చేసిన పార్టీ రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్రంలో చేపట్టాల్సిన కార్యాచరణపై పలు అంశాలను ప్రతిపాదించారు. లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్ ఆయా అంశాలను వివరించారు. విస్తృతంగా చర్చించిన మీదట తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో కారుమంచి గణేష్, సరోజాదేవి, శివచంద్రం, సుధాకర్, అశోక్, శివరామకృష్ణ, రాజీవ్ తదితరులు మాట్లాడారు.

### సమావేశం ఆమోదించిన తీర్మానాలు

- 2024 సంవత్సరంలో దశలవారీగా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది.
- రాష్ట్ర ప్రజల సమగ్రాభివృద్ధిపై ప్రభుత్వం చేపట్టాల్సిన వివిధాంశాలపై ముఖ్యమంత్రిని కలిసి విజ్ఞాపన పత్రం అందచేయాలి.
- ఫిబ్రవరి 3,4 తేదీల్లో నిర్వహించే రెండు రోజుల రాజకీయ శిక్షణా శిబిరానికి నాయకత్వ ఆసక్తి ఉన్న ప్రతినిధులను ఎంపిక చేసి వారిని భాగస్వాముల్ని చేయాలి.



- పార్టీ నిర్మాణానికి, కార్యక్రమాల నిర్వహణకు జిల్లా, నగర, పట్టణ, మండలాలవారీగా నాయకులను, కార్యకర్తలను గుర్తించి పదవీబాధ్యతలను అప్పగించాలి.
- రెండవ దశలో పార్టీ కార్యకర్తలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించాలి. అందుకు 100 మంది ప్రతినిధులను ఎంపిక చేయాలి.
- రాష్ట్ర రాజధాని కేంద్రంలో పార్టీ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలి.
- లోక్‌సత్తా ఎజెండాతో కలసివచ్చే వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, 50 - 100 సంఘాలను గుర్తించి ఆహ్వానించాలి.

సమావేశంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులతోపాటు కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ బృందం పాల్గొన్నారు. ❖



# ఓట్ల కోసమైనా రేవంత్ సమగ్ర ఆరోగ్య విధానం అమలు చేస్తారా?



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై ఓ నెటిజన్ కామెంట్‌పై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కె. తారక రామారావు స్పందిస్తూ, వైద్య కళాశాలలను ప్రారంభించటం కంటే యూట్యూబ్ న్యూస్ ఛానళ్లను ఏర్పాటు చేసుకుని ఉంటే ఎన్నికల్లో గెలిచి ఉండేవారమన్నారు. ప్రచారం తక్కువై తాము ఓడిపోయామన్నారు. తాము గ్రహించేలోగానే కాంగ్రెస్ పార్టీ నెగెటివ్ ప్రచారం ప్రజల్లోకి వెళ్లిందన్నారు. మరోవంక, తాము పరిపాలన మీద ఎక్కువ దృష్టి పెట్టి పార్టీని నిర్లక్ష్యం చేశామన్నారు. ఆ తర్వాత మరో మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా ఇదే తరహా వ్యాఖ్య చేశారు. యూట్యూబ్ ఛానళ్లు తమ పార్టీని దెబ్బతీశాయన్నారు.

కొంత లోతుగా ఆలోచిస్తే కేటీఆర్ కామెంట్లలో కొన్ని ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి.

ఒకటి, ప్రచారం తక్కువై బీఆర్ఎస్ ఓడిపోలేదు. ఒక దశలో ప్రచారానికి నిధులు లేక కాంగ్రెస్ కటకటలాడగా, బీఆర్ఎస్‌కు నిధుల కొరత లేదన్నది తెలిసిన విషయమే. కానీ బీఆర్ఎస్ ప్రచార తీరు ఎక్కువ నష్టం చేసింది. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా, లోపాల్ని అంగీకరించకుండా కేవలం ప్రభుత్వ విజయాల్ని కీర్తిస్తూ ప్రచారం సాగింది. అది కూడా కేవలం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల చుట్టూ సాగింది. బీఆర్ఎస్ పథకాలు ఎంత విజయవంతమైనవైనా వరుసగా మూడోసారి గెలుపుకి అవి సరిపోవని గుర్తించకుండా ముగ్గురు వ్యక్తుల చుట్టూ తిప్పటం వల్ల ప్రచారం ఉధృతమైనకొద్దీ ప్రజల్లో వెగటు కలిగించింది. కేసీఆర్ ఆత్మవిశ్వాసంగా అనుకున్నది ప్రజలు అతిశయంగా భావించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తాత్కాలిక హామీల అమలు పెనుభారమని, మిగిలిన అన్ని విషయాల్లో రెండు పార్టీలూ ఒకటే అయినా, రాష్ట్రానికి అత్యంత కీలకమైన ఆర్థికాభివృద్ధి పరంగా కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ మెరుగనే వాస్తవాన్ని ఎక్కువమంది ప్రజలు గుర్తించలేకపోయారు. ఆర్థికాభివృద్ధి కంటే కేసీఆర్ వ్యక్తిగత అహంకారమనే చాలా చిన్న అంశాన్ని ప్రజలు అంత భూతద్దంలో చూసి వ్యతిరేక ఓటు వేయటానికి లోపం ప్రధానంగా కేసీఆర్ పాలనా నమూనాలో ఉంది. చాలా రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో లాగానే కేసీఆర్ అధికార కేంద్రీకరణను అమలు చేసినా, రాష్ట్ర సాధకుడిగా ఆయనకు అసాధారణ వ్యక్తిగత ఆకర్షణ ఉన్నా, అప్రజాస్వామిక, అశాస్త్రీయ, ఏకపక్ష ధోరణులతో తీసుకొచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టు, దళితబంధు వంటి పథకాలు కలిగించిన భారీ నష్టం ఆయన ఇమేజ్‌ను కూడా ప్రశ్నించే స్థాయికి చేరింది. ప్రభుత్వ వ్యతిరేకత దీనికి తోడయ్యింది. ఈ వాస్తవాల్ని గుర్తించకుండా ప్రచారం చేయటంతో ప్రతికూల ఫలితాలనిచ్చింది. ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచి కేసీఆర్ సన్నద్ధమవుతున్నా, ఈ లోపాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం చేయలేదు. దీంతో బలహీనమనుకున్న కాంగ్రెస్ బలపడి, బీఆర్ఎస్, బీజేపీలను దెబ్బతీసింది. ఎన్నికల్లో ఓటమి తర్వాత విశ్లేషణలో కూడా ఈ లోపాల్ని గుర్తించకుండా, వ్యక్తులే పార్టీని గెలిపించగలరు, కుటుంబాలే పార్టీల్ని నడిపించగలరు అని కేటీఆర్ భావించటం మళ్లీ అదే తప్పు చేసినట్లవుతుంది. కేసీఆర్ వ్యక్తిగత, ప్రచార పంథా మార్చుకుని ప్రజల్లోకి వెళ్లటం, కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేల్ని మార్చటం వంటి పనులు చేసి ఉంటే, ఈసారికి గెలిచి ఉండేవారేమోగానీ, మౌలికంగా పాలన, రాజకీయ పరంగా లోపాలు మాత్రం ఆయన పార్టీని వెన్నాడుతూనే ఉంటాయి. ఓటమి, విపరీత రాజకీయ పోటీ మధ్య పార్టీ అంతరించిపోయే ప్రమాదాలు పొంచి ఉంటూనే ఉంటాయి. కేటీఆర్ పేర్కొన్న వైద్య ఆరోగ్య రంగానికి సంబంధించే ఇక్కడ చూద్దాం.

ఎటువంటి వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే విధంగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ 2021 నవంబర్‌లో విడుదల చేసినప్పుడు సీనియర్ జర్నలిస్టొకరు ఒక ఆంగ్ల పత్రికలో వ్యాసం రాశారు. అందులో ఆయన కేసీఆర్ ప్రభుత్వానికి ఒక కీలక సూచన చేశారు.

"తెలంగాణలో వైద్య సాయం కోసం ప్రజలు కేటీఆర్ ట్విటర్ హ్యాండిల్‌ను నమ్ముకుంటున్నారు. ఆ డైనమిక్ యువ నాయకుడు కూడా ఉత్సుకతతో ప్రతిస్పందిస్తూ అవసరంలో ఉన్న ప్రజలకు ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. ఎవరెంత చేసినా అంతిమంగా అదనపు బాధ్యతలున్నవారికి అప్పచెప్పటం కంటే, ఆరోగ్య శాఖకు పూర్తిస్థాయి మంత్రి ఉంటేనే ఫలితాలు బాగుంటాయి. సాధారణ ప్రజానీకం కోసం కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు ముగ్గురూ డాక్టర్ జేపీ రూపొందించిన ఆరోగ్య విధానం నమూనాపై మేధోమథన సమావేశాన్ని జరపాలి. ఆరోగ్య విధాన పత్రంలో జేపీ చెప్పినట్లు, నిజమైన రాజకీయం లక్ష్యం మనిషి ఆనందాన్ని పెంపొందించటం, ఆ ఆనందాన్ని సాధించటంలో కీలకమైన అంశం ఆరోగ్యం. ఆరోగ్య రంగాన్ని మెరుగుపరిచే ఏ సానుకూల చర్యయినా, ఓట్లు కూడా తెచ్చిపెడుతుంది".

తెలంగాణలో, కొంత మేర దేశంలో ఆరోగ్య రంగం ఎంత సంక్షోభంలో ఉందో కూడా ఆ జర్నలిస్టు వివరించారు:

"ఆరోగ్య సంరక్షణ విషయంలో ప్రభుత్వాల చేతుల్లో ప్రజలు దగా పడ్డారనటంలో సందేహం లేదు. రకరకాల స్కీములున్న ప్రస్తుత ఆరోగ్య వ్యవస్థ పట్ల ప్రజలు వేసారిపోయారు. కొవిడ్-19 వారి భ్రమల్ని మరింత పటాపంచలు చేసింది. అధ్వాన్న మౌలిక వసతులు, అపరిశుభ్ర పరిసరాలతో ఎక్కువ శాతం ప్రభుత్వాస్పత్రులు రోగులు, వారి కుటుంబ సభ్యుల విశ్వాసాన్ని చూరగొనటంలో విఫలమయ్యాయి. డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు, డయాగ్నొస్టిక్ పరీక్షల బిల్లులు, మందుల ధరలు - ఇలా పెరిగిపోతున్న ఖర్చులకు భయపడి అల్పాదాయ వర్గాలు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఇతర చౌక వైద్య పద్ధతులను ఆశ్రయిస్తున్నారు.

ఏప్రిల్, మే 2021లో కొవిడ్ రెండో అల ఉధృతంగా విరుచుకుపడినప్పుడు ఇతర రాష్ట్రాలు, దేశాల లాగే తెలంగాణ తల్లడిల్లింది. ఈ ప్రపంచ ఆరోగ్య సంక్షోభం 1979 నాటి స్కైలాబ్ అనుభవాన్ని గుర్తుచేసింది. స్కైలాబ్ ఏ క్షణాన కూలుతుందోనని అందరూ బిక్కుబిక్కుమంటూ రోజులు, వారాలు గడిపారు. ఆ అతిపెద్ద అంతరిక్ష నౌక ఎప్పుడోకప్పుడు భూమి మీద పడుతుందని తెలిసినా ఎప్పుడు, ఎక్కడ కూలుతుందో తెలియని పరిస్థితి. అదేరీతిలో కంటికి కనిపించని కొవిడ్ వైరస్ అనేకమంది ఊపిరితిత్తులను కబళిస్తున్నా, కచ్చితంగా, ఎలా, ఎప్పుడు అనేది ఎవరికీ అంతుచిక్కని స్థితి.

స్కైలాబ్ మెటల్ బాల్ ప్రభావాన్ని తప్పించుకునేందుకు ఆ రోజుల్లో రాజకీయ నేతలు బంకర్లలో తలదాచుకోగా, వారి



ప్రస్తుత తరం వైరస్‌లను తప్పించుకునేందుకు ఫాంహౌస్‌లకు తరలివెళ్లారు. లేదంటే ప్రశాంత ఏకాంత ప్రకృతి ప్రదేశాల్లో సేదతీరారు. మనుషులతో కలవకుండా ఉండటానికి సకల జాగ్రత్తలూ తీసుకున్నా ఆ విషక్రిమి బారినపడ్డ నేతలు, అత్యంత అధునాతన కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరిపోయారు. ఎటొచ్చీ సాధారణ ప్రజలే ఆక్సిజన్ సిలిండర్లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ పడకలు, విశ్వసనీయ ఔషధాల కోసం అటూఇటూ పరుగులు పెట్టారు. లక్షలాది మంది నిస్సహాయ స్థితిలో కన్నుమూశారు. వైరస్ సృష్టించిన భయంతో వారు సరైన అంతిమ సంస్కారాలకు కూడా నోచుకోలేదు.

తమ కుటుంబ సభ్యుల వైద్య అవసరాల కోసం ప్రజలు ఏళ్ల తరబడి పొదుపు చేసుకున్న డబ్బు ఖర్చు చేశారు. బంగారు ఆభరణాలు, స్థలాలు, భూముల్ని అమ్మి తెచ్చి సొమ్ముల్ని గుమ్మరించారు. మన వైద్య వ్యవస్థలో అడుగడుగునా ఉన్న డొల్లతనాన్ని కంటికి కనిపించని ఆ క్రిమి నిర్దాక్షిణ్యంగా బట్టబయలు చేసింది. ఈ మానవతా సంక్షోభాన్ని ఎదుర్కోవటంలో ప్రభుత్వ ఘోరవైఫల్యానికి క్షోభించనివారంటూ లేరు. మరణాల సంఖ్యను కూడా ప్రభుత్వం తగ్గించి చూపిందన్న ఆరోపణలున్నాయి. సరిగ్గా ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లోనే తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆరోగ్యమంత్రి ఈటల రాజేందర్‌ను భూఆక్రమణలకు సంబంధించిన ఆరోపణల మీద కేబినెట్ నుంచి తొలగించారు.

మన అనుభవాల నుండి నేర్చుకోమా? ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ప్రాణాలు హరిస్తున్న కొవిడ్-19 మూడో అలను ఎదుర్కొనేందుకు సిద్ధమవటానికి బదులు చౌకబారు రాజకీయ విన్యాసాలా?

ఇదే సమయంలో 'Towards Viable Universal Healthcare' పేరుతో అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఆచరణసాధ్య నమూనాను సమగ్ర నివేదిక రూపంలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ - ఎఫ్‌డీఆర్) విడుదల చేసింది. ఆరోపణలు, నిందల రాజకీయ గోలలో, ఆ చిత్తశుద్ధి ప్రయత్నానికి తగిన ప్రచారం లభించలేదు.

సరైన ఆరోగ్యం అందుబాటులో లేక చికిత్సలకు జేబులో నుండి చేస్తున్న ఖర్చు వల్ల సుమారు ఆరు కోట్ల మంది భారతీయులు

## బ్రిటన్ ఎన్నారైలను అడగాల్సింది

దావోస్ నుంచి తిరిగొస్తూ ముఖ్యమంత్రి రేవంత్ మధ్యలో లండన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, మాకు పక్క రాష్ట్రాలతో పోటీపడాలని లేదు, ప్రపంచంతోనే మా పోటీ అని పేర్కొన్నారు. ఐటీ హబ్, ఔషధ సంస్థలు, జీనోమ్ వ్యాలీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్, ఐటీ పార్కు ఉన్న హైదరాబాద్ మహానగరం తెలంగాణకు అండగా ఉందన్నారు. అదేవిధంగా అక్కడి థేమ్స్ నది తరహాలో హైదరాబాద్‌లోని మూసీ నది పునరుజ్జీవనానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. థేమ్స్ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును అభివృద్ధి చేసిన విధానాలను ఆ నది పాలక మండలి, పోర్ట్ ఆఫ్ లండన్ అథారిటీ ఉన్నతాధికారులు, నిపుణులను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో మురికికూపంగా మారిన మూసీనదిని రాబోయే 36 నెలల్లో థేమ్స్‌లా అభివృద్ధి చేస్తామన్నారు. ఆ తర్వాత, వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్‌లో భారతీయ మూలాలున్న బ్రిటన్ పార్లమెంటు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత గురించి కీలకంగా ప్రస్తావించారు. ప్రపంచంలోని సమస్యలకు ప్రజాస్వామ్యమే పరిష్కారమని, దేశంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందే అవకాశాలు అసలైన ప్రజాస్వామ్యం ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. ఇవన్నీ ఆహ్వానించదగ్గ ఆలోచనలు, ప్రయత్నాలు. కానీ తెలంగాణ ప్రపంచస్థాయిలో పోటీపడాలంటే, బలమైన ప్రజాసామ్య సమాజంగా అందరికీ ఎదిగే అవకాశాలను అందివ్వాలంటే కీలకంగా కావలసింది రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవటం. జేపీ చెప్పినట్లు, 'ఒక ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయాలే అన్నిటికీ కేంద్రబిందువు. మనిషి ఆనందాన్ని పెంపొందించటమే నిజమైన రాజకీయాల లక్ష్యం. ఆనందంలోని ఒక కీలక అంశం ఆరోగ్యం. డబ్బును సరిగా వినియోగిస్తే బహుముఖంగా అనేకరెట్లు ఫలితాలనిచ్చే రంగం ఇది. దుర్భర పేదరికాన్ని అంతం చేయటానికి అత్యంత వేగవంతమైన మార్గం ప్రజలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించటం. పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో ఆరోగ్యం, విద్య విధానాలపై, ఆ సేవలు అందుతున్న తీరుపై ప్రజలు దృష్టి పెట్టకుండా ఒక్క రోజు కూడా గడవదు. భారతదేశంలో మాత్రం రాజకీయ ప్రక్రియ ప్రజల జీవితాలు, సాధికారత వంటి అంశాలతో సంబంధం లేకుండా సాగుతోంది'. కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల తెలంగాణలో ఏటా 19 లక్షల మంది అప్పటిదాకా పేదలు కానివారు పేదలవుతున్నారు. ముఖ్యమంత్రి లండన్‌లో ప్రస్తావించిన అనేక ప్రపంచ స్థాయి వసతులతోపాటు ఔషధ పరిశ్రమ, తగినంతమంది వైద్య సిబ్బంది వంటి వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే అతి తక్కువ అదనపు ఖర్చుతో తెలంగాణలో ప్రతి ఒక్కరికీ ఎటువంటి జేబుఖర్చూ లేకుండా నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించవచ్చు. బ్రిటన్ దేశమే ఈ విషయంలో అత్యుత్తమ నమూనా మనకు అందిస్తోంది. ముఖ్యమంత్రి అక్కడి తెలంగాణ ప్రజల్ని, ఇతర భారతీయులను అడిగి ఉంటే అందరికీ ఆరోగ్యాన్ని అందించేందుకు ఎప్పుడో 1948లో ప్రవేశపెట్టిన సమగ్ర ఆరోగ్య వ్యవస్థ (ఎన్‌హెచ్ఎస్) తాము నివశిస్తున్న దేశాభివృద్ధికి ఎంత కీలకంగా ఉపయోగపడిందో వివరించేవారు. ప్రపంచ దేశాల నమూనాలన్నిటినీ అధ్యయనం చేసి బ్రిటన్ నమూనాలో భారతీయ పరిస్థితులకనుగుణంగా మార్పులతో జేపీ రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయటానికి రేవంత్ ప్రభుత్వం చొరవ తీసుకుంటే, ఆయన ఆశిస్తున్నట్లు తెలంగాణ ప్రపంచస్థాయిలో పోటీ పడటానికి అవసరమైన బలమైన అడుగులు వేయగలుగుతుంది.

పేదరికంలోకి జారిపోతున్నారని, దాదాపు 50 లక్షల మంది దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోతున్నారని ఆ పత్రం వెల్లడించింది. ప్రజల్లో అత్యధికులు (74.6%) ఖర్చు ఎక్కువవుతున్నా తమ వైద్య అవసరాల కోసం ప్రయివేటు రంగం మీదే ఆధారపడాల్సిన పరిస్థితి ఉందంటే, ఎన్నికైన ప్రజాప్రతినిధులు సిగ్గుతో తలదించుకోవాలి.

ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం అతి తక్కువగా ఉండటం (జీడీపీలో 1.2 శాతం లోపు మాత్రమే) ప్రజల ఆర్థిక స్థితిగతుల్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఒక అంచనా ప్రకారం, హైదరాబాద్‌లో ప్రతి 22,323 మందికి ఒక మద్యం దుకాణం ఉండగా, 77,792 మంది నివాసితులకు ఒక పోలీస్ స్టేషన్ మాత్రమే ఉంది. రాష్ట్ర రాజధానిలో కొవిడ్-19 చికిత్సకు ప్రతి 34,691 మంది నివాసితులకు ఒక ఆస్పత్రి మాత్రమే ఉంది. ఇక బెల్టుషాపులు విచ్చలవిడిగా ఉండి, వైద్య సదుపాయాలు అరకొరగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఊహించుకోవచ్చు".

ఇప్పుడు ఎన్నికలయ్యాక 2024, ఫిబ్రవరికి వస్తే, కేటీఆర్ అభిప్రాయపడుతున్నట్లు, జిల్లాకో మెడికల్ కాలేజీ అవసరం లేదు. ఈ మాట జేపీ మూడు నాలుగేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వానికి చెబుతూనే ఉన్నారు. మనకి డాక్టర్‌ల కొరత లేదు, ఎఫ్‌డీఆర్ ప్రతిపాదించిన విధానం అమలు చేయటానికి కూడా తెలంగాణలో ఒక్క ఏడాది పట్టా తీసుకునే ఎంబీబీఎస్ డాక్టర్లు చాలు, అదే విధంగా మనకు ఆధునిక వైద్యానికి కొదవ లేదు. సంపన్నులు, విదేశాల నుంచి వచ్చే వారికి ప్రపంచ స్థాయిలో, మిగిలిన దేశాలతో పోలిస్తే తక్కువ ఖర్చుకే ఆధునిక వైద్యం అందిస్తున్నాం, మన సమస్య మిగిలిన 80 శాతం పైగా ప్రజలకు జేబు ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవటం అని జేపీ అనేకమార్లు బహిరంగంగా ప్రభుత్వానికి తెలియచేశారు. కానీ ప్రభుత్వం వినిపించుకోకుండా మెడికల్ కళాశాలలు, కేసీఆర్ కిట్లు, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లే ఆరోగ్య రంగమన్నట్లు వ్యవహరించింది. నిజంగా జేపీ

ప్రతిపాదించిన ఆరోగ్య విధానంపై చర్చించి అమలు చేసి ఉంటే తెలంగాణలో ప్రతి ఇంటికీ ఒక ఫ్యామిలీ డాక్టర్ అందుబాటులోకి వచ్చి ఉండేవారు. ఇందులో ఢిల్లీ మొహల్లా క్లినిక్‌ల కంటే మెరుగ్గా ప్రజలకు వైద్యం అందేది. ఎందుకంటే, మొహల్లా క్లినిక్‌ల తరహాలో ప్రభుత్వం చెప్పిన డాక్టర్ వద్దకే రోగులు వెళ్లాల్సిన అవసరం లేదు. కొన్ని గ్రామాలకు కేంద్రంగా ప్రతి ఊరికీ ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండే పంచాయితీ లేదా చిన్న పట్టణంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య సెంటర్‌లో పది మంది వైద్యుల బృందం అందుబాటులో ఉండేది. రోగులు తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంచుకోవచ్చు. అక్కడే ఉచిత దయాగ్నొస్టిక్‌లు, మందులు ఉంటాయి. డాక్టర్ ఎంతమంది రోగులకు ఔట్ పేషెంట్ సేవలందిస్తే రోగికి ఇంత చొప్పున అంత ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుంది, నాణ్యమైన వైద్యం అందిస్తేనే ప్రజలు ఆదరిస్తారు కాబట్టి, సేవల్లో డాక్టర్లు పోటీ పడతారు కాబట్టి ప్రజలకు మంచి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేవి. ఫ్యామిలీ డాక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తుంటారు కాబట్టి ఇటీవల తెలంగాణలో ఎక్కువవుతున్న అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి వ్యాధులు చాలావరకు అదుపులోకి వచ్చేవి. ముదిరి మరో పెద్ద వ్యాధికి దారితీయకుండా నివారించగలిగేవారం. అసలు చాలామందిలో ఈ వ్యాధులు రాకుండా కూడా చర్యలు తీసుకోవటం సాధ్యమయ్యేది. అదేవిధంగా ఆస్పత్రి సేవలు అవసరమైతే ఫ్యామిలీ డాక్టరే సిఫార్సు చేసి అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా అందిస్తారు కాబట్టి, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్య సేవలు కూడా మెరుగ్గా అందేవి. ఫ్యామిలీ డాక్టర్ సిఫార్సు, సమీక్షతోపాటు, జవాబుదారీతనానికి పటిష్ఠ సంస్థాగత ఏర్పాట్లు ఉన్నందున, ద్వితీయ స్థాయి వైద్యంలో అమలు చేసే ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లలో వృథా ఖర్చు, అరకొర సేవలు లేకుండా నాణ్యమైన సేవలు ప్రజలు అందేవి. అదేవిధంగా తృతీయ స్థాయి వైద్యాన్ని ప్రభుత్వాస్పత్రులలోనే అయినా ఔట్ పేషెంట్ సేవలు లేకుండా ఆధునిక వసతులతో, పేరొందిన స్వతంత్ర వైద్య నిపుణుల సేవలతో కూడా అందిస్తారు కాబట్టి ప్రజలకు సౌకర్యవంతంగా, మంచి వైద్యం అందుబాటులోకి వచ్చి ఉండేది. ఈ మొత్తం మనకు నిజమైన శ్రేయోభిలాషిగా ఉంటూ, ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఉండే సంప్రదాయ ఫ్యామిలీ వైద్యంలోలా జరుగుతుంది. కానీ అప్పటి రోజుల కంటే ఎన్నో రెట్లు మెరుగైన, ఆధునికమైన వైద్య సేవలు ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అందుతాయి. ఈ అవకాశాన్ని పరిశీలించకుండా కేసీఆర్ ప్రభుత్వం జారవిడిచింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లయితే, లక్షల మంది పేదరికం నుంచి బయటపడేవారు, మిగిలిన ప్రజలకి ఆర్థిక భారం ఎంతో తగ్గేది, వ్యవసాయంలో ఆదాయం కాస్త తగ్గినా రైతులు ఊరట చెందేవారు, ప్రజల ఉత్పాదక శక్తి పెరిగేది, అనేక ఉపాధి అవకాశాలు వచ్చేవి కాబట్టి యువతలో అసంతృప్తి ఏర్పడేది కాదు. ఇందుకయ్యే ఖర్చుకి కేసీఆర్ ఎడమ చేత్తో సంతకం పెట్టేయగలిగేవారు. ఈ విధానం ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వ్యతిరేకం కాదు, దాంతోపాటు మెడికల్ టూరిజం కారణంగా వారి ఆదాయాలు పెరుగుతుంటాయి తప్ప తగ్గవు కాబట్టి వారి నుంచి ప్రభుత్వానికి ఆ బలమైన వర్గాల నుంచి సమస్య కూడా వచ్చేది కాదు. పైగా జాతీయ స్థాయిలోనే కాదు, మరే రాష్ట్రంలోనూ లేని రీతిలో సమగ్ర వైద్య విధానాన్ని అమలు చేశామని సగర్వంగా చాటుకుని దేశానికి ఒక మార్గం చూపే అవకాశం కేసీఆర్‌కు లభించేది. ఆరోగ్య రంగంలో ఈ విధానం అమలు చేసి ఉంటే, ఈ ఒక్క విధానమే కేసీఆర్‌ను ఓటమి నుంచి కాపాడి ఉండేదంటే అతిశయోక్తి కాదు. ఆరోగ్యశ్రీ వల్ల వైఎస్ రాజశేఖర రెడ్డికి గణనీయంగా ఓట్లు వచ్చాయని మనందరికీ తెలుసు. ఆరోగ్యశ్రీలా పరిమితమైనది కాకుండా సమగ్ర ఆరోగ్య విధానం కాబట్టి కేసీఆర్ అహంకారం, కాంగ్రెస్ తాత్కాలిక హామీలను పట్టించుకోకుండా ప్రజలు ఆరోగ్య సేవలపై స్పందనగా ఓట్లు వేసేవారు. ఆరోగ్య రంగాన్ని ఇంకా మెరుగుపరచటం, ఆరోగ్యంలోలా మిగతా రంగాల్లో పాలనను

## నీతి ఆయోగ్ పేదరికం లెక్కలు

గత తొమ్మిదేళ్ల కాలవ్యవధిలో దాదాపు 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని నీతి ఆయోగ్ ఇటీవల ఒక పత్రం విడుదల చేసింది. 2013-14లో 29.17 శాతంగా నమోదైన పేదరిక నిష్పత్తి 2022-23 నాటికి 11.28 శాతానికి తగ్గిందని తెలిపింది. ఈ అధ్యయనానికి వినియోగించిన బహుముఖ పేదరిక సూచీ (ఎంపీఐ) అసమగ్రమైనదే కాదు తాత్కాలికమైనదన్న విమర్శలను తోసిపుచ్చలేం. దేశవ్యాప్తంగా 81.35 కోట్ల మందికి ఉచితంగా ఆహారధాన్యాలను పంపిణీ చేయటం మొదలైన పథకాలు పేదరికం తగ్గుదలలో కీలక పాత్ర పోషించాయని నీతి ఆయోగ్ స్వయంగా పేర్కొంది. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలు అవసరమేగానీ, వాటి మీదే ఆధారపడి పేదరిక నిర్మూలనను అంచనా వేయలేం. వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం ఉండటంతోపాటు అభివృద్ధి సుస్థిరంగా కొనసాగుతుండేలా ప్రభుత్వం తన మౌలిక బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చాలి. ఇందులో ఆరోగ్య రంగాన్ని విస్మరిస్తే కేవలం ఉత్పాదకత తగ్గటం మాత్రమే కాదు, పేదరికం కూడా పెరుగుతుంది. ప్రభుత్వాలు ఇంకేమీ చేయకున్నా, కేవలం ఆరోగ్య రంగాన్ని బాగు చేసి ప్రజలందరికీ వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన ఆరోగ్యాన్ని అందిస్తే, పదేళ్లలో దేశంలో పేదరికాన్ని రూపుమాపవచ్చు. అందుకే ప్రజలకు ఉపాధి అవకాశాల్ని పెంచే ఆర్థికాభివృద్ధికి చర్యలతోపాటు వారికి ఆరోగ్య భద్రతను అందించే విధానాన్ని అమలు చేయటం కీలకం. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించటంలో కీలకమైన ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉన్న, అభివృద్ధి చెందుతున్న మన లాంటి దేశంలో పేదరికం భారీగా తగ్గిందని నీతి ఆయోగ్ లాంటి సంస్థ ప్రకటించటం సరైన తీరు కాదు.

మెరుగుపరచటం, రాజకీయ ఎజెండాను ఆ దిశగా మలచటం ఎన్నికల్లో చర్చాంశాలయ్యేవి.

త్వరలో పార్లమెంటు ఎన్నికలున్నాయి కాబట్టి, కాంగ్రెస్, బీఆర్ఎస్ గెలుపోటముల మధ్య తేడా తక్కువ కాబట్టి, పట్టణ జనాభాలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలో బీఆర్ఎస్ అభివృద్ధి నమూనాకు ఆదరణ ఉంది కాబట్టి, మనది ఎన్నికల్లో గెలుపోటముల్ని జీవన్మరణ సమస్యగా భావించే సమాజం కాబట్టి కేటీఆర్ కిందపడ్డా మనదే పైచేయి అన్నట్లుగా మాట్లాడుతుండొచ్చుగానీ, బీఆర్ఎస్ ఓటమిపై లోతైన పరిశీలన అవసరం.

ఇక ఇదే సమయంలో రాష్ట్రంలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ దీన్నుంచి పాఠాలు నేర్చుకోవాలి. ఆరోగ్య రంగం మీద దృష్టి సారించటంతోపాటు వైద్యరంగంలో వస్తున్న, భవిష్యత్తులో రాబోయే ఆధునిక మార్పులను కూడా పరిగణలోకి తీసుకుంటూ సరైన ప్రాధాన్యతలతో సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలి.

కొవిడ్‌కు ముందునుంచీ ఆరోగ్యానికి ప్రజల్లో డిమాండ్ ఉంది. అందుకే ఆరోగ్యశ్రీ, జేపీ చొరవతో వచ్చిన ఇఎంఆర్ఐ రాజకీయంగా కూడా ప్రజల ఆమోదాన్ని పొందాయి. వైద్య రంగంలో ప్రయివేటు రంగంలో పెట్టుబడులకు ఉన్నకొద్దీ అవకాశాలు పెరుగుతాయి. ఇందుకు మనం తప్పుపట్టాల్సిందేమీ లేదు. ప్రజలకు ఆర్థిక భారం లేకుండా ఆరోగ్యం అందించటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, వరుస ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది కాబట్టి ప్రయివేటు భాగస్వామ్యం కూడా కొంతమేర తప్పనిసరి. అందుకే ద్వితీయ స్థాయి వైద్యంలో ప్రయివేటు నర్సింగ్ హోంల భాగస్వామ్యాన్ని ఎఫ్‌డీఆర్ నమూనా ప్రతిపాదించింది. ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యానికి భరోసా ఇస్తూ ప్రయివేటు పెట్టుబడులను ఎంత ప్రోత్సహించినా నష్టం లేదు, అది పూర్తిగా సాధ్యం. అదేవిధంగా వైద్య రంగంలో సాంకేతికతలు వేగంగా పెరుగుతున్నాయి. వైద్యం ఆధునికమవుతున్నకొద్దీ చికిత్స ఖర్చులు కూడా పెరుగుతుంటాయి. ఇటీవలికాలంలో కృత్రిమ మేధ వంటి పద్ధతుల ద్వారా చౌకగా వైద్యాన్ని అందించవచ్చనే ప్రచారం పెద్దఎత్తున జరుగుతోంది. ఇవన్నీ చూస్తుంటే, మొబైల్ ఫోన్లు అందుబాటులోకి వచ్చినంత తేలిగ్గా ప్రజలకు ఆరోగ్యాన్ని అందించవచ్చనే భావం కలుగుతోంది. ఇందులో కొంత వాస్తవముంది. వ్యాధుల విశ్లేషణ, అందుబాటులో ఉన్న వైద్య విధానాల గురించిన స్పష్టత, అంచనా, సూచనలకు సాంకేతికత చాలా ఉపయోగపడుతుంది. కానీ రాబోయే వైద్యం ప్రధానంగా నివారణ, అంతకంటే ముందు, సానుకూల ఆరోగ్య జాగ్రత్త చర్యలకు సంబంధించిన అంశమని నిపుణులు ప్రామాణికంగా అంచనా వేస్తున్నారు. కాబట్టి ఒక పరిధి దాటి సాంకేతికతలకు సంబంధించిన అంశం కాదు,

ఇప్పుడున్న వైద్య వ్యవస్థంతా సమూలంగా మారిపోతుందని కాదు దీనర్థం. వ్యాధి వచ్చాక మందులివ్వటం, ఆపరేషన్లు చేయటం చుట్టూనే ప్రధానంగా ప్రస్తుత వైద్య విధానం నడుస్తోంది. సాంకేతికతల్ని వేగంగా ప్రోత్సహిస్తూ వైద్య ఖర్చును పెంచేస్తోంది. అందువల్ల ఈ వైద్యం ఖరీదైనదనటాన్ని ఎవరూ తప్పు పట్టలేరు, కొంతమేర ఇది అవసరం కూడా. ఉదాహరణకి, భారత్‌లో ఏటా రెండు కోట్ల మందికి ఆపరేషన్లు జరుగుతుంటాయి. కానీ వీరిలో అత్యధికులకు ఆ వైద్యం కోసం ఇన్సూరెన్స్ ఆధారిత పథకాలను అమలు చేయటానికి ప్రభుత్వం పరిమితమైతే, కొందరికి వ్యక్తిగత ఉపశమనం కలుగుతుంది తప్ప ఆరోగ్య సంక్షోభం మాత్రం పెరుగుతుంటుంది. కాబట్టి వీరికి చికిత్స ఏర్పాట్లతోపాటు అనారోగ్య సమస్యలున్న మిగిలినవారికి కూడా నాణ్యమైన ఆరోగ్యం అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం, అదే విధంగా అంతమందికి ఆరోగ్య సమస్యలు ముదరకుండా, సమాజంలో ఆరోగ్య సంక్షోభం పెరగకుండా వ్యవస్థను నిర్మించటం అవసరం. కొవిడ్ వచ్చాక కూడా మన చర్చ తృతీయ స్థాయి వైద్యం, మందులు, ఆపరేషన్లు, కిట్లు దాటి ముందుకు వెళ్లలేదు. ఇప్పటికైనా ఆధునిక వైద్య మార్పుల్ని, పరిణామాల్ని పరిగణలోకి తీసుకుంటూ ప్రజలందరి ఆరోగ్య సంరక్షణ కోసం సమగ్ర విధానంపై విస్తృతంగా చర్చించటం, అందుకు తగ్గ విధానాలపై దృష్టి సారించటం అవసరం.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయటం గురించి మాట్లాడారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఆధ్వర్యంలో 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్' (సీ4ఐఆర్)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బయో ఏషియా–2024 సదస్సులో భాగంగా ఫిబ్రవరి 28న ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ కేంద్రం ద్వారా రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ మెరుగుదలకు సాంకేతిక ఆధారిత కార్యక్రమం రూపకల్పనకు మార్గం సుగమమైందన్నారు. ప్రపంచ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ విధానాలను సరికొత్తగా పునర్నిర్వచించే ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయని, చిన్న పట్టణాలు, గ్రామాలకు ఈ సేవలను సాంకేతికత ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణను హెల్త్ టెక్నాలజీకి కేంద్రంగా, ప్రపంచ గమ్యస్థానంగా మార్చటానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా అన్నారు. అందరికీ ఆరోగ్య సంరక్షణకు అవసరమైన సాంకేతిక విధానాల లభ్యతకు ఈ ఒప్పందం దోహదపడుతుందని సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక వేదికకు సంబంధించిన సీ4ఐఆర్ నెట్‌వర్క్ ఇప్పటి వరకు అయిదు ఖండాల్లో విస్తరించి ఉంది. తెలంగాణలో నెలకొల్పనున్న ఈ కేంద్రం ప్రపంచంలో 19వది. అయితే దీనికి అనుబంధంగా ఆరోగ్య సంరక్షణ, జీవ వైద్య శాస్త్ర కేంద్రం ఏర్పాటు చేయనుండటం ఇదే తొలిసారి.

అయితే ఇంతకుముందే అనుకున్నట్లు, భవిష్యత్తు వైద్య ఆరోగ్య అవసరాలకు సాంకేతికత మాత్రమే చాలదు. సాంకేతికతను వినియోగిస్తూ చికిత్సకు నిపుణులైన వైద్యులుండటంతోపాటు, అసలు వ్యాధులు వచ్చే అవకాశాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించటం, వచ్చే అవకాశాలున్నప్పుడు నివారించటం, అయినా వచ్చినప్పుడు ప్రాథమిక దశలోనే నియంత్రించటం అంతకంటే ముఖ్యం. ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో, యువ జనాభా అత్యధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో, ఎక్కువ ఫలితాలనిచ్చే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను నిర్లక్ష్యం చేసి పైస్థాయి చికిత్సలకు ప్రాధాన్యతనివ్వటం చాలా నష్టదాయకమవుతుంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌డీఆర్ ప్రతిపాదించిన ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ పునాదిగా గల సమగ్ర ఆరోగ్య విధానం కీలకమైనది.

ఎఫ్‌డీఆర్ ప్రతిపాదించిన ఆరోగ్య విధానం నమూనాపై లోతైన చర్చ చేసి తెలంగాణకు సమగ్ర ఆరోగ్య విధానం రూపొందించేందుకు రేవంత్ ప్రభుత్వం చొరవ చూపటం అవసరం. తన వ్యాసంలో ఆ జర్నలిస్టు ఇంకో మాట కూడా చెప్పారు. "పటిష్ఠమైన ఆరోగ్య వ్యవస్థ నిర్మాణానికి డాక్టర్ జేపీ అపార అనుభవాన్ని, ఆయన బృందాన్ని ఉపయోగించుకుంటే నష్టం లేదు. రెండేళ్ల కాలానికి లోక్‌సత్తా వ్యవస్థాపకుడ్ని ఆరోగ్య సలహాదారుగా నియమించుకోవటంలో తప్పేముంది? ఈ రకమైన ఉదాత్త నిర్ణయం దేశంలో కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతుంది. జేపీ వైద్య నేపథ్యమున్న ఉన్నత విద్యావంతుడు, పాలనా నిపుణుడు. మచ్చలేని వ్యక్తిత్వం కలిగిన, విలువలున్న రాజకీయవేత్త" అన్నారాయన. జేపీ యూపీయే హయాంలో జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ)లో పనిచేశారు. ఆయనకు క్యాబినెట్ మంత్రి స్థాయి హోదా ఉందనే విషయం ఆయన సన్నిహితులకు కూడా తెలియదు. ఆ సౌకర్యాలను జేపీ ఏనాడూ ఉపయోగించుకోలేదు. కాబట్టి పదవి ముఖ్యం కాదు. ఏదోకరకంగా జేపీ ప్రతిపాదిస్తున్న విధానాలను చర్చించి అమలు చేయటం ముఖ్యం. వీటిల్లో ఎంతో కీలకమైనది, తెలంగాణకు, దేశానికి తక్షణం అవసరమైనది ఆరోగ్య విధానం. తక్కువ ఖర్చుతో ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఎటువంటి వ్యక్తిగత ఆర్థిక భారం లేకుండా ఆచరణసాధ్యంగా ఎఫ్‌డీఆర్ ఆరోగ్య విధానం అందిస్తుంది. ఆరోగ్యశ్రీ కోసం అనర్హులు కూడా తెల్లకార్డులు తీసుకోవటం వంటి సమస్యలు ఉండవు. ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ వల్ల ప్రజలందరి ఆరోగ్య డిజిటల్ ఆరోగ్య సమాచారం ప్రామాణికంగా అందుబాటులో ఉంటుంది. తెలంగాణలో పేదరికాన్ని నిర్మూలించి ఉత్పాదకతను పెంచటంలో, అభివృద్ధిని వేగవంతం చేయటంలో ఎఫ్‌డీఆర్ ఆరోగ్య విధానం కీలకమవుతుంది. చిన్న పట్టణాలు అభివృద్ధి, రైతులపై ఆర్థిక భారం తగ్గించటం, గ్రామీణ – పట్టణ ప్రాంతాల మధ్య అంతరం తగ్గించటంలో కూడా ఈ నమూనా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ రకమైన వికేంద్రీకరణ, ఆదాయాలు కొరవడి గ్రామీణ ప్రాంతాల్లో అసంతృప్తి పెరగటం వల్లే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలయిందని మర్చిపోకూడదు. ఆదాయం పెంచుకునేందుకు, వైద్య వృత్తి పట్ల ప్రజల్లో గౌరవాన్ని పెంపొందించేందుకు ఈ విధానం అమలుకు డాక్టర్లు కూడా కృషి చేయాలి. ముఖ్యమంత్రి రేవంత్ ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆరోగ్య విధానం నమూనాను అమలు చేసి ఓట్లు పొందే, మిగతా దేశానికి ఆదర్శంగా నిలిచే ప్రయత్నం చేస్తారా, ప్రజలు కేవలం వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలకే ఓట్లు వేయరని, చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తే ఎన్నిసార్లయినా గెలిపిస్తారన్న ఒడిశా చెబుతున్న పాఠం నుంచి నేర్చుకుంటారా లేక కేసీఆర్ ప్రభుత్వంలా అవకాశాన్ని జారవిడుస్తారా? ఇదీ తెలంగాణలో ఈవేళ కీలక రాజకీయ ప్రశ్న. ❖

# అవినీతి సూచిలో దిగజారిన భారత్ ర్యాంకు




అవినీతి సూచిలో భారత్ మరింత దిగజారింది. 2022లో 40 పాయింట్లు సాధించిన మన దేశం 2023లో 39 పాయింట్లకు పరిమితమైంది. మొత్తం 180 దేశాల్లో భారత్ 93వ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ స్థాయిలో అవినీతి ఏ మేరకు ఉందో నిపుణులు, వ్యాపారవేత్తల అభిప్రాయాలు తీసుకుని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ సున్నా నుంచి 100 మధ్య పాయింట్లను కేటాయించింది. సున్నా అయితే అవినీతి ఎక్కువని, 100 అయితే అవినీతిరహితమని పేర్కొంది. పొరుగున ఉన్న పాకిస్థాన్, శ్రీలంక వరుసగా 113, 115 ర్యాంకుల్లో నిలిచాయి. చైనా 76వ స్థానంలో ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని 71 శాతం దేశాలు అవినీతి సూచిలో 45 కంటే తక్కువ పాయింట్లతో ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని న్యూజిలాండ్ మూడు, సింగపూర్ అయిదు ర్యాంకులను సాధించాయి. ఉత్తర కొరియా 172వ ర్యాంకులో, మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్ 162వ స్థానంలో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా అవినీతిరహిత దేశంగా డెన్మార్క్ నిలవగా, ఫిన్లాండ్ రెండో స్థానంలో ఉంది. అత్యంత అవినీతిమయ దేశంగా సోమాలియా నిలిచింది.

# పాఠశాల విద్యాప్రమాణాలే లక్ష్యం..
# ఉపాధ్యాయ నైపుణ్య శిక్షణ ప్రాజెక్టు కోసం కలిసిపనిచేద్దాం



స్కూళ్లలో పిల్లల నమోదు మన సమస్య కాదని, వారికి నాణ్యతా ప్రమాణాలున్న విద్య అందకపోవటం మన దేశాభివృద్ధికి పెద్ద అవరోధంగా ఉందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయుల్లోనూ ప్రమాణాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విద్యతోనే నిజమైన వికాసం సాధ్యమన్నారు. తల్లిదండ్రులు, తమ పిల్లలు ఏ పాఠశాలలో చదువుతున్నారు, ఎన్ని లక్షల రూపాయల ఫీజు కడుతున్నాం, మార్కులు, ర్యాంకుల వంటి వాటిపైనే దృష్టి సారించకుండా వారిలో విద్యాపరంగా మేధోవికాసం, తెలివితేటల్ని ఎలా వినియోగిస్తున్నారు అనే అంశాలను తరచూ పరిశీలిస్తుండాలన్నారు. అప్పుడే విద్యార్థులు తమకు, కుటుంబానికి, సమాజానికి కూడా పనికిరాగలరన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ఎఫ్‌డీఆర్ కార్యాలయంలో జేపీతో సమావేశమైంది. బడ్జెట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల శిక్షణకు విద్యాపరిశోధన, అభివృద్ధి కేంద్రాల ఏర్పాటుపై వారు చర్చించారు. జేపీ మాట్లాడుతూ, రాజకీయాలు, సమాజం మారాలన్నా, ఆర్థిక వ్యవస్థ బాగుపడాలన్నా పాఠశాల విద్యను మించిన సాధనం మరొకటి లేదన్నారు. విద్య చుట్టూ పిల్లల అభ్యసన సామర్థ్యాల చుట్టూ తిరగాలన్నారు. ఉపాధ్యాయుల నైపుణ్య శిక్షణ కోసం ప్రాజెక్ట్‌ను టస్మా రూపొందిస్తే, ప్రభుత్వం, రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, యువత సంఘటితమై కలసికట్టుగా పనిచేద్దామని సూచించారు. ట్రస్మా కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, విద్యావేత్త కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ట్రస్మా సభ్యుడు రాజు పాల్గొన్నారు.

## దేశంలో 96 కోట్ల మంది ఓటర్లు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 96 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులని, వీరిలో మహిళలు 47 కోట్ల మంది ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) గణాంకాలు పేర్కొంటున్నాయి. ఓటు వేసేందుకు అర్హులైనవారిలో 1.73 కోట్ల మంది 18–19 ఏళ్ల వయసు వారు. ఎన్నికల నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా 12 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముందని, దాదాపు 1.5 కోట్ల మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు ఈసీ వర్గాలు తెలిపాయి. గతేడాది రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం పంపిన లేఖ ప్రకారం.. దేశంలో 1951లో 17.32 కోట్ల మంది నమోదైన ఓటర్లు ఉండగా, 2019 నాటికి ఈ సంఖ్య 91.20 కోట్లకు చేరింది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో 45 శాతం పోలింగ్ నమోదు కాగా, గత పార్లమెంటు ఎన్నికల్లో 67 శాతంగా ఉంది.

# సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకంపైనే దేశ భవిష్యత్తు

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



ప్రభుత్వాలు చేయాల్సిన కీలక బాధ్యతల్లో మన దేశం ఇప్పటికీ అధ్వాన్నంగా ఉందని, అయితే దేశీయంగా ఇప్పటివరకు చేసిన కొన్ని మంచి పనుల వల్ల, పనిచేసే జనాభా ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా వచ్చే పాతికేళ్లలో ఆర్థికంగా వేగంగా ఎదిగే అవకాశాలు మనకు అందుబాటులోకి వచ్చాయని, వీటిని సద్వినియోగపరచుకోవటం చుట్టూనే మన రాజకీయ చర్చ ఉండాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్ పరిపాలనను విశ్లేషిస్తూ సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ రాసిన 'మూడు దారులు' పుస్తకాన్ని విజయవాడలో ఆయన ఆవిష్కరించారు.

తెలుగునాట వినటం మర్చిపోయామని, ఏం చెబుతున్నారు అని కాకుండా.. చెప్పేవాళ్లు ఏ పార్టీ, ఏ కులం అని ఆలోచిస్తున్నారని జేపీ అన్నారు. ఒక ట్రైబల్ సమాజంలా తయారయ్యామన్నారు. రాజకీయమంటే రణరంగం కాదన్నారు. భావాల సంఘర్షణ తప్ప వ్యక్తిగత ద్వేషాలు ఉండవన్నారు. కానీ మనం రాజకీయాన్ని రణరంగంగా మార్చేశామన్నారు. భిన్నాభిప్రాయాల్ని సామరస్యంగా, నిజాయతీగా చర్చించి ప్రజల్ని ఒప్పించటం రాజకీయమని, ఇందులో రణరంగం ఏముంటుందని ప్రశ్నించారు. రాజకీయం పట్ల ద్వేషాన్ని విపరీతంగా పెంచుతున్నారని, మధ్యయుగాల నాటి పైశాచిక ధోరణుల్ని ఈవేళ్టి రాజకీయంలో జొప్పించారన్నారు. రాజకీయాన్ని అవమానించేలా ఇటీవల ఓ ఆంగ్ల ఛానల్‌లో యాంకర్ ప్రవర్తించటాన్ని ప్రస్తావిస్తూ, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయన్నారు. రాజకీయ నాయకులు గొప్పా కాదు, వారిని అవమానించటమూ సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నో లోపాలుండొచ్చుగానీ, తప్పులు నుంచి నేర్చుకుని సరిదిద్దుకోవటం తప్ప పరిష్కారం లేదన్నారు.

రాజకీయ పార్టీల మధ్య ద్వేషం మరింత దారుణమని, సిగ్గుచేటని జేపీ తీవ్రంగా ఖండించారు. సమాజంలో తిలక్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ లాంటి వారి పేర్లను ఆదర్శంగా తీసుకుంటాం తప్ప ద్వేషాన్ని రెచ్చగొట్టే దరిద్రుల్ని, నీచుల్ని, జుగుప్సాకర నేతల్ని ఆదర్శంగా తీసుకోమని పార్టీలు గుర్తించాలన్నారు. సిద్ధాంతపరంగా రాజకీయాల్లో పోరాడండి, ప్రజలు మద్దతిస్తే అమలు చేయండి తప్ప, తిట్టుకోవటం, ద్వేషం తగదన్నారు. ముప్పై ఏళ్ల క్రితం తమిళనాడులో ఉన్న రాక్షసత్వం, పైశాచికత్వాల్ని ఇప్పుడు తెలుగునాట మనం పుణికిపుచ్చుకున్నామన్నారు. రిజర్వేషన్లు, ఆంధ్ర, తెలంగాణ ఇలా ఎన్నో వర్గాల ఆకాంక్షల్ని, ప్రయోజనాల్ని సమన్వయం చేస్తుంది కాబట్టి రాజకీయం పవిత్ర వ్యాసంగమని, ప్రస్తుతం తెలుగునాట ఆ స్పృహ కొరవడిందన్నారు. రెండోది, స్వల్పకాలం తప్ప

దీర్ఘకాల రాజకీయ దృష్టి కొరవడుతోందన్నారు. మనది నిరుపేద దేశమైనా, ప్రభుత్వాలు అధ్వాన్నంగా ఉన్నా కూడా తల్లిదండ్రులు చేసిన త్యాగాలు, ఖర్చులు తగ్గించుకుని వారు పొదుపు చేయటం వల్ల మనందరం గత తరాలవారి కంటే మెరుగైన స్థితిలో ఉన్నామని, ఈ జాగ్రత్త, భవిష్యత్తు దృష్టిని ప్రభుత్వాలు మర్చిపోయాయన్నారు. విభిన్న వర్గాల అవసరాలను సమన్వయం చేయటం మర్చిపోతే అన్ని రంగాలూ అధ్వాన్నంగా తయారై విద్వేషం, అరాచకత్వం పెరుగుతాయన్నారు.

తెలుగునాట ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు అభివృద్ధి మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తే, జగన్ సంక్షేమ పథకాలను చివరి మనిషి వరకూ సమర్థంగా అందిస్తున్నారని, అయితే ఈ రెండు దారులూ సరిపోవని, మిగతా విషయాలు ఎలా ఉన్నా వైఎస్ రాజశేఖరరెడ్డి సంక్షేమం, అభివృద్ధి మధ్య సమన్వయంతో ప్రజాదరణ పొందగలిగారని జేపీ అన్నారు.

ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, చట్టబద్ధపాలన, అధికార వికేంద్రీకరణ మొదలైన అంశాల్లో మార్పులు కొంత ఆలస్యమైనా కనీసం ఆర్థికాభివృద్ధిని పరిరక్షించుకోగలిగితే తెలుగు రాష్ట్రాలు, దేశ భవిష్యత్తుకు భరోసా లభిస్తుందన్నారు. నాయకులు తమ ఇంట్లో వాళ్లతో ఎలా వ్యవహరిస్తారు వంటి విషయాలు మనకు అనవసరమని, మనం చూడాల్సింది వారి ఎజెండా, వారు చేసే పనుల వల్ల మన జీవితానికి ఏం జరుగుతోంది అన్నది మాత్రమేనన్నారు. మన ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు మాత్రమే వారిని ఎన్నుకుంటున్నామన్నారు. కష్టంలో ఉన్నవారికి తాత్కాలిక సాయం అవసరమని, కానీ అదే పరిపాలన అయితే వినాశకరమన్నారు. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించటం మేరకైనా మనం జాగ్రత్త పడటం ఈవేళ మనముందున్న కర్తవ్యమన్నారు. జాతీయ విద్యావిధానాన్ని సక్రమంగా అమలు చేయటం, ఆరోగ్యంలో కొద్దిమేర పెట్టుబడులు పెంచి సరైన విధానంలో వెచ్చించటం, ఉపాధి అవకాశాల్ని పెంచే రీతిలో పెట్టుబడుల్ని ప్రోత్సహించటం ద్వారా ఆర్థికాభివృద్ధిని సుస్థిరం చేయగలమన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయాల్లో నిజాయతీ తగ్గిపోయి, కులం, ధనం ప్రభావం పెరిగిపోయాయని, దేశ రాజకీయాల్లో విలువల పతనం ఎప్పటి నుంచి ప్రారంభమైందో మనం గుర్తించాలన్నారు. జేపీ ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా అందించిన సేవలను గురించి ఇప్పటికీ చెప్పుకుంటారని, పౌరులు ఎవరైనా ఏ సమయంలోనైనా సమస్యల మీద తన వద్దకు రావచ్చని ఆయన బోర్డు ఏర్పాటు చేశారని, ఈవేళ ఒక ఐఏఎస్ అధికారి అపాయింట్‌మెంట్ దొరకటం కూడా కష్టమని స్వర్ణాంధ్ర దినపత్రిక సంపాదకుడు కేబీజీ తిలక్ అన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రులు అనుసరించిన విధానాలను ఒక పుస్తక రూపంలో తేవటం కత్తి మీద సాములాంటిదన్నారు.


విశాలాంధ్ర సంపాదకులు ఆర్.వి రామారావు మాట్లాడుతూ, ముగ్గురు ముఖ్యమంత్రులదీ విధానాలు వేరైనప్పటికీ దారి ఒకటేనన్నారు. ముఖ్యమంత్రుల గురించి మాత్రమే కాకుండా అప్పట్లో రాష్ట్రంలో, దేశంలో రాజకీయ, ఆర్థిక పరిణామాల్ని కూడా విశ్లేషిస్తే బాగుండేదని, పునర్ముద్రణలో ఈ లోపాల్ని సవరించుకోవాలని విశ్రాంత అధ్యాపకుడు ఎ.సుబ్రమణ్యం సూచించారు. చంద్రబాబు, వైఎస్సార్, జగన్‌లను దగ్గర నుంచి చూసిన అనుభవాలతో ఈ పుస్తకాన్ని రాసినట్లు అమర్ తెలిపారు. విద్యార్థులు, పోటీ పరీక్షల్లో పాల్గొంటున్న యువత ఈ పుస్తకంలో తప్పనిసరిగా చదవాల్సిన కొన్ని అధ్యాయాలను వక్తలు ప్రస్తావించారు. ❖

# ప్రజల సాధికారత ఇప్పటికీ అసంపూర్ణ లక్ష్యం

భారతదేశం ఒడిదుడుకులను తట్టుకుని ఈరోజు ప్రపంచ దేశాల్లో గౌరవం పొందటంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషించిందని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో పతాకావిష్కరణ అనంతరం మాట్లాడుతూ, అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన రాజ్యాంగం మనకు ఎంతో కీలకమైన స్వేచ్ఛలను అందించినా, ప్రజల సాధికారత ఇప్పటికీ సాధ్యం కాలేదన్నారు. పెత్తందారీ రాజకీయం కొనసాగుతూ డబ్బున్నవారికి తప్ప సామాన్యులకు ఎన్నికల్లో పోటీ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. ప్రజల డబ్బుతోనే తాయిలాలు పంచుతూ వారిని యాచకులుగా కొనసాగిస్తున్నారన్నారు. ఆర్థికాభివృద్ధిని అందుకునేందుకు సమానావకాశాల్ని అందించటం లేదన్నారు. ఈ పరిస్థితిని మార్చే ఎజెండాపై పార్టీలకతీతంగా ఏకాభిప్రాయం అవసరమన్నారు.



కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, పి.ఎల్.ఎన్ రాజు, పొలుపర్తి అప్పారావు, సిమ్మ శ్రీను, చిన్నారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


WARNING!
Pension expenditure draining States' Total revenue
20%
10%
0%
4.7%
10.9%
11.6%
14.3%
1990-91
2000-01
2010-11
2020-21
Source: Preserving Growth Momentum, A Viable Framework for Fiscal Prudence, FDR
REFUSE IT DEFUSE IT!
OLD PENSION SCHEME
VOTE NOW
www.refuseops.in

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th Febraury, 2024 Posting Date 15 &16th of every month





‘పరిపాలన- నైతికత, విలువలు’ అంశంపై హైదరాబాద్ ఐఎస్‌బీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్





*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**